# ఈనాడు చిత్తూరు

సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు


## హరో హర



6లో

శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయంలో ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆఖరి రోజు ఆదివారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి దర్శనమిచ్చారు.




11లో

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు 153వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో 'గోదాదేవి కల్యాణము' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

# బంతి.. లాభాలు భ్రాంతి

- పూల సాగులో రైతులకు పుట్టెడు కష్టాలు
- అందుబాటులో లేని రవాణా, మార్కెట్ వసతి
- పూల మండీల్లో ప్రైవేటు దోపిడీ
- ఏటా కమీషన్ల రూపంలో రూ.10 నుంచి రూ.15 కోట్లు నష్టపోతున్న వైనం



గులాబీలు గుచ్చుకుంటున్నాయి. కనకాంబరాలు కంటతడి పెట్టిస్తున్నాయి. లిల్లీ పూలు లొల్లి చేస్తున్నాయి. బంతి పూలు బాధపెడుతున్నాయి. ఇదీ.. పూలసాగు చేస్తున్న రైతుల పరిస్థితి. ఇటీవల వరలక్ష్మి వ్రతం వంటి పెద్ద పండుగ వచ్చినా పూల రైతుల మోములో ఆనందం కన్పించ లేదు. మార్కెట్లో ధరలకు రెక్కలొచ్చినా దళారుల మోసాలకు రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో తిరుపతి, మదనపల్లె తప్ప ఎక్కడా హోల్‌సేల్ మార్కెట్ లేదు. పూలు అధికంగా పండే మండలాల్లో ప్రైవేటు 'పూల మండీలు' (ఫ్లవర్ కలెక్షన్ సెంటర్లు) ఉన్నాయి. రైతులు స్థానికంగా ఉండే మండీలనే ఆశ్రయిస్తుండగా.. వారు 12% నుంచి 15% వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారు. కమీషన్ల రూపంలో రైతులు సంవత్సరానికి రూ.10 నుంచి రూ.15 కోట్లు నష్టపోతున్నారు. అంతేకాదు శాంపిల్, తరుగు పేరుతో మరిన్ని పూలు అదనంగా తీసుకుంటూ అన్నదాతల చెవిలో పూలు పెడుతున్నారు.

- చిత్తూరు, న్యూస్‌టుడే, వాల్మీకిపురం

### సాగు పెరిగి.. ధరలు తగ్గి

వర్షాకాలంలో పూలను ఎక్కువగా సాగుచేయరు. రబీతో పోల్చితే ఖరీఫ్‌లో సాగు తక్కువ. అందుకే ధరలు కూడా ఆశాజనకంగా ఉంటాయి. ఖరీఫ్‌లో కిలో పూలు రూ.30-60 ఉంటే, రబీలో రూ.5-10 వరకు పలుకుతాయి. రబీలో సాగు ఎక్కువగా చేయడమే ధరల పతనానికి కారణం. ఇలా ప్రతి రబీలోనూ రైతులు నష్టాలబారిన పడడం సాధారణమైపోయింది. బంతిపూలు వర్షాకాలంలో పండిస్తే నాణ్యత తగ్గుతాయి. వర్షాకాలం, ఎండాకాల బంతిపూలకు వ్యత్యాసం ఉంటుంది. వర్షాకాలం నాణ్యతలేని పంటకు ధరలు తగ్గుతాయి.

**ప్రస్తుతం పూల ధరలు(కిలో..)**

| బంతి | చామంతి | కనకాంబరం |
|---|---|---|
| రూ.30-32 | రూ.110-130 | రూ.350-400 |

**జి**ల్లాలో దాదాపు 6400 హెకార్లలో పూల తోటలు సాగవుతున్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో పూల సాగు అధికంగా ఉంది. పంట కాలం తక్కువ. కొద్ది పెట్టుబడితో పాటు నీటి అవసరం పెద్దగా ఉండదు. సాగు చేసేందుకు మొక్కలు కొనే ఖర్చు కూడా తక్కువే. కూరగాయాలు పండించే రైతులు పంట మార్పిడి కింద పూల సాగు చేస్తున్నారు. సాగుకు తగిన మార్కెట్లు జిల్లాలో అందుబాటులో లేవు. మామిడి, టమోటా పంటలు జిల్లాలో అధికం. వాటికి మార్కెట్‌యార్డులున్నాయి. పూల సాగు అధికంగా ఉన్నా..సరిపడా మార్కెట్ వసతి లేదు. జిల్లా మొత్తానికి తిరుపతి, మదనపల్లెలో తప్పా ఎక్కడా హోల్‌సెల్ మార్కెట్‌లు లేవు. పూలు అధికంగా పండే మండలాల్లో ప్రైవేటు 'పూల మండీలు' (ఫ్లవర్ కలెక్షన్ సెంటర్లు) మాత్రమే ఉన్నాయి. ఇవన్నీ ప్రైవేటు యాజమాన్యం పరిధిలో ఉంటాయి. వారు ఇష్టారీతిలో ధరలు నిర్ణయిస్తూ, కమీషన్లు వసూలు చేస్తూ రైతులకు దోచుకుంటున్నారు. చేసేది లేక స్థానిక మండీలకే పూలను తరలిస్తున్నారు. కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పుంగనూరు, పలమనేరు, మదనపల్లె, చిత్తూరు వంటి పశ్చిమ ప్రాంతాల్లో ప్రైవేటు మార్కెట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని మండీల నుంచి బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తారు. సత్యవేడు, పుత్తూరు వంటి తూర్పు ప్రాంతాల నుంచి తమిళనాడుకు తీసుకెళ్తారు.

**పూలు పండించే ప్రాంతాలు ఇలా..** కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పుంగనూరు, చౌడేపల్లె, వాల్మీకిపురం, రామసముద్రం, మదనపల్లె, ములకలచెరువు వంటి పశ్చిమ ... మిగతా 2లో

# చిగురించిన ఆశలు!

## వేరుసెనగకు జీవం పోసిన వర్షం

**న్యూస్‌టుడే, చిత్తూరు(వ్యవసాయం):** వరుణుడు కరుణించాడు.. వర్షంతో వేరుసెనగ పంటలకు జీవం వచ్చినటైంది. పంట పచ్చగా దర్శనమిస్తుండటంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ఖరీఫ్ ప్రారంభం జూన్ నెలలోనే తొలకరి చినుకులు పలకరించాయి. వ్యవసాయ శాఖ సకాలంలో రాయితీ వేరుసెనగ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసింది. జూన్ నెలాఖరు, జులై మొదట్లో వేరుసెనగ విత్తులు విత్తారు. వేరుసెనగ సాధారణ సాగు 1,29,743 హెక్టార్లకుగాను 1,04,222 హెక్టార్లు సాగైంది. జులై మొదటి వారం నుంచి వర్షం జాడే కానరాక విత్తుకు అదును దాటిపోవడంతో సాధారణ సాగు జరగలేదు. సాగైన పంటకు 25 రోజుల పాటు వర్షం లేక పంట ... మిగతా 2లో



కళకళలాడుతున్న వేరుసెనగ పంట

# తిరుమలలో మూడంచెల భద్రత!

- ఎఫ్‌ఆర్‌ఎస్ వినియోగం
- 2వేల మంది నేరస్థుల వివరాల సేకరణ
- చర్యలు చేపట్టిన తితిదే అధికారులు

**ఈనాడు-తిరుపతి:** తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు తితిదే అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందుకోసం మూడంచెల భద్రతా వ్యవస్థను రూపొందించారు. తిరుమలకు చేరుకునే మార్గాలైన అలిపిరి నడక, వాహనాల దారితోపాటు అటు శ్రీవారిమెట్టు వద్ద నేరస్థులను గుర్తించేందుకు వీలుగా ముఖాలను గుర్తించే సాఫ్ట్‌వేర్ (ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్)ను అందుబాటులోకి తీసుకువస్తారు. అలాగే మాడవీధుల్లో విక్రయదారులు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు.. ... మిగతా 2లో



## చరవాణి తెచ్చిన తంట



కనుమ రహదారిపై పడిపోయిన వాహనం

**తిరుమల, న్యూస్‌టుడే:** చోదకుడి నిర్లక్ష్యంతో తిరుమల కనుమ రహదారిపై వాహనం బోల్తా కొట్టింది. నిర్లక్ష్యానికి తోడు వాహనం కండిషన్ లేకపోవడంతో ప్రమాదం జరిగింది. తిరుమల మొదటి కనుమ రహదారి 16 మలుపు వద్ద జీపు అదుపు తప్పి రహదారిపై పడిపోయింది. ఈ సమయంలో వాహన చోదకుడు సిసింద్రీ చరవాణిలో మాట్లాడుతున్నాడు. ప్రమాదంలో ముగ్గురు భక్తులు గాయపడ్డారు. చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనాన్ని తరలించి ట్రాఫిక్‌ను తితిదే రవాణా విభాగం డీఐ భాస్కరనాయుడు పునరుద్ధరించారు.

# చిగురించిన ఆశలు!

**(మొదటి పేజీ తరువాయి)** ఎండిపోవడం, వాడుముఖం పట్టడం ప్రారంభమైంది. ఎట్టకేలకు వరుణుడు దయచూపడంతో ఈ నెల మొదటి వారం నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది. దీంతో వాడుముఖం పట్టిన పంటకు వర్షం ఒక్కసారిగా ప్రాణం పోసింది. పంట పూత దశలో పచ్చపచ్చగా దర్శనమిస్తోంది. సెప్టెంబరు నెల మొదట్లో వర్షం కురిస్తే పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు.

### అంతరపంటలకూ మేలు

వేరుసెనగ సాగులో అంతరపంటగ సాగుచేసిన కంది, అనప, అలసంద పంటలు సైతం కళకళలాడుతున్నాయి. పప్పుదినుసుల సాగు విస్తరణకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రయోగాత్మకంగా రాయితీ వేరుసెనగ విత్తనాలతో పాటు చిరుధాన్యాలు, పప్పుదినుసులైన కంది, అలసంద, అనప, జొన్న, రాగి విత్తనాలను కిట్ల రూపంలో రాయితీపై రైతులకు అందజేశారు. జిల్లాలో సుమారు 70 వేల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు వేరుసెనగలో అంతర పంటగా సాగు చేశారు. సకాలంలో వర్షం కురవడంతో అంతర పంటలు కళకళలాడుతున్నాయి. కంది పంట బాగుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### అనుకూలించిన ఆగస్టు

వేరుసెనగ పంటకు జులై, ఆగస్టు నెలలు గడ్డుకాలం. ప్రతి ఏటా జూన్ నెలలో అదునుకు వర్షాలు కురిసి.. రైతులు ఆశతో వేరుసెనగ విస్తారంగా సాగు చేస్తారు. జులై, ఆగస్టు నెలల్లో పంట పూత, ఊడల దశలో ఉంటుంది. జులై నెలలో సకాలంలో వర్షాలు కురిసినా.. ఆగస్టు నెలలో వర్షం జాడే కానరాకపోవడంతో పంట ఎండిపోయి రైతులు నష్టపోవడం ప్రతిఏటా సాధారణంగా మారుతోంది. ఈ ఏడాది జూన్ సాధారణ వర్షపాతం 78.7 మి.మీటర్లు కాగా 28 మి.మీటర్లు అధిక వర్షపాతం నమోదైంది. జులై నెలలో వరుణుడు ముఖం చాటేయడంతో సాధారణ వర్షపాతం 102 మి.మీటర్లు కాగా 32 మి.మీటర్లు లోటు వర్షపాతంతో 70.1 మి.మీటర్లు నమోదైంది. ఎండ తీవ్రత అధికమైంది. 20-25 రోజులు వరుసగా వర్షం జాడే కానరాలేదు. ఆగస్టు నెల ప్రారంభం నుంచి ప్రతి రోజు జిల్లాలో వర్షం కురుస్తోంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 117.4 మి.మీటర్లు కాగా.. ఇంకా పదిరోజులు మిగిలిఉండగానే 100.3 మి.మీటర్ల నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వర్షాధార పంట వేరుసెనగతో పాటు ఉద్యాన పంటలకు ఎంతో లాభదాయకమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

### జిప్సం లాభదాయకం..

వేరుసెనగ పంటకు జిప్సం వినియోగంతో నాణ్యమైన అధిక పంట దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం పంట పూతదశలో ఉంది. ఎకరం విస్తీర్ణానికి 200 కిలోల జిప్సంను తడిలేని సమయంలో భూమిలో చల్లి.. ఆ తర్వాత మొక్కల మధ్య తవ్వకం చేపట్టాలి. తద్వారా ఊడలకు జిప్సం సులభంగా అందుతుంది. కాయలు నాణ్యతగా, కాయ నిండ పప్పు ఏర్పడుతుంది. నూనె శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ దశలో పంట పొలంపై జిప్సం తప్ప ఎటువంటి ఎరువుల వినియోగం మంచిది కాదు. ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న జిప్సంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **- విజయకుమార్, జేడీ, వ్యవసాయశాఖ**



# బంతి.. లాభాలు భ్రాంతి!


**(మొదటి పేజీ తరువాయి)** ప్రాంతాల్లో పూల సాగు ఎక్కువగా ఉంది. తూర్పు ప్రాంతాలు సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరుల్లో ఓ మోస్తరుగా సాగు చేస్తారు. ముఖ్యంగా బంతిపూలను కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పుంగనూరు, చౌడేపల్లె, రామసముద్రం మండలాల్లో ఎక్కువగా పండిస్తారు. చామంతి పూలను గుడుపల్లె, కుప్పం, గంగవరం, పుంగనూరు, మదనపల్లె, రామసముద్రం, చౌడేపల్లె, పెనుమూరు మండలాల్లో పండిస్తున్నారు. మల్లెపూల సాగు ములకలచెరువు, వాల్మీకిపురం, సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం ప్రాంతాల్లో అధికం. రోజా పూలు రామకుప్పం, కుప్పం, రామసముద్రం, వి.కోట, బైరెడ్డిపల్లె, ములకలచెరువు, పెద్దతిప్ప సముద్రం మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. కాగడ పూలు కుప్పం, పెద్దతిప్ప సముద్రం, ములకలచెరువు, మదనపల్లె ప్రాంతాల్లో అధికం. కనకాంబరం కుప్పం, నారాయణవనం, సత్యవేడు, పిచ్చాటూరు ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం ఎక్కువ. లిల్లీ పూలు శాంతిపేరం, కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె వంటి ప్రాంతాల్లో పండిస్తున్నారు.

### సాగు పెరిగినా..

గత రెండేళ్లుగా జిల్లాలో బంతిపూల సాగు విపరీతంగా పెరిగిపోయింది. దీన్ని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అన్ని రకాల పూలు దాదాపు 6400 హెక్టార్లలో సాగు అవుతున్నాయి. అధికంగా బంతిపూలు 2,200 హెక్టార్లలో సాగవుతుండగా, చామంతి 1200హెక్టార్లు, మల్లెపూలు 350హెక్టార్లు, రోజాపూలు 200హెక్టార్లు, లిల్లీ 550హెక్టార్లు, కనకాంబరం 425హెక్టార్లు, కాగడ 450హెక్టార్లు, ఇతర పూలు వెయ్యి హెక్టార్లలో సాగవుతున్నాయి. గత రెండేళ్ల నుంచి జిల్లాలో బంతిపూల సాగు పెరిగింది. ఈ పూలను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇవి తక్కువ కాలంలో చేతికి అందుతాయి. టమోటా పండించే రైతులు పంట మార్పిడి కింద వీటిని సాగు చేయడం, సాగు ఖర్చులు తక్కువ కావడం, కూలీలు కూడా కోయడానికి వచ్చేందుకు ఇష్టపడతారు. ఇలాంటి కారణాలతో విస్తీర్ణం పెరిగింది.

### పూలసాగులో మార్కెటింగ్, రవాణానే కీలకం

పూలసాగులో రైతులు ఆదాయం పొందాలంటే దిగుబడికి మార్కెటింగ్ వసతి ఉండాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది. జిల్లా సరిహద్దుల్లోనే బెంగళూరు, చెన్నై నగరాలు ఉన్నాయి. సకాలంలో ఆ ప్రాంతాలకు పూల దిగుబడులను తరలిస్తే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే వీలుంది. చిన్నకారు రైతులు పండించిన పంట దిగుబడికి రవాణా సౌకర్యం లేక దళారులను నమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు. పూలరైతులకు ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పిస్తే సకాలంలో నగరాల్లోని పూల మార్కెట్‌లకు తరలించి ఆదాయం పొందే వీలుంటుంది.



కుప్పలుగా సన్నజాజిపూలు

### మార్కెట్‌ను శాసిస్తున్న బెంగళూరు బటన్ రోజాలు

ఒకప్పుడు మల్లె, గుండుమల్లె, చామంతి, బంతిపూలదే అగ్రస్థానం. విశేష దినాలు, పర్వ దినాలతో పాటు సాధారణ రోజుల్లో కూడా అలంకరణలకు వీటిని వాడేవారు. ప్రస్తుతం వీటి స్థానాన్ని క్రమేపి బెంగళూరు బటన్ రోజాలు ఆక్రమిస్తున్నాయి. ఇవి దాదాపు ఐదు రంగుల్లో మార్కెట్‌లో ఉండడం, నాణ్యతోపాటు, ఎక్కువ రోజులు మన్నిక ఉండడంతో కొనుగోలుదారులు ఎక్కువ మంది బెంగళూరు బటన్ రోజాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇవి కిలో రూ.60 నుంచి రూ.100లోపు ఉండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు. బటన్ రోజాల ప్రభావం మల్లె, గుండుమల్లె, చామంతి తదితర పూలపై పడుతోంది.

### ఏటా రూ.10 కోట్ల కమీషన్

పూల మార్కెట్‌లలో రైతుల నుంచి వందకు రూ.12 నుంచి 15శాతం కమీషన్ కింద మండీ యజమానులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో 6400(16వేల ఎకరాలు) హెక్టార్లలో పూలసాగు జరుగుతోంది. ఈ లెక్కన ఎకరం పొలంలో పూలసాగు చేస్తే సరాసరి ఏడాదికి మూడు టన్నుల పూల దిగుబడి వస్తుంది. జిల్లాలో ఏడాదికి దాదాపు 48 వేల టన్నుల పూల దిగుబడి వస్తుంది. సరాసరిన టన్నుకు రూ.10 నుంచి రూ.15వేల వరకు కమీషన్ తీసుకుంటారు. ఈ లెక్కన జిల్లాలోనే ప్రతి ఏటా పూల మండీ యజమానులు రైతుల నుంచి రూ.10 నుంచి రూ.12 కోట్లకు పైగా కమీషన్ కింద నగదును రైతుల నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్‌లో పూల ధరలు ఆశాజనకంగా ఉంటే కమీషన్ మూడురెట్లు అదనంగా వ్యాపారులకు చేతికి వెళుతుంది.

### కూలీల డిమాండ్



ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకుని సన్నజాజి పూలను సాగు చేస్తున్నాం. ఈ ఏడాది అమాంతంగా కూలీల డిమాండు పెరిగిపోయింది. కలుపు తీయాలంటే రోజుకు రూ.250 కూలీ చెల్లించాల్సి వస్తోంది. రవాణా, భోజన ఖర్చులు అదనం. ఇక పూలను కోసేందుకు కిలోకు రూ.80 చెల్లించాల్సిందే. దీనికి తోడు మార్కెట్‌లో వందకు రూ.15 వరకు కమీషన్లు, తరుగు, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చు.. ఇలా అన్నీ కలిపి రూ.100 నుంచి రూ.120 వరకు ఖర్చు వస్తోంది. శ్రావణమాసం మినహా గత రెండు నెలలుగా మార్కెట్‌లో సన్నజాజులు కిలో రూ.100 నుంచి 120 మాత్రమే పలికాయి. మార్కెట్‌లో లభిస్తున్న ధర, అవుతున్న ఖర్చుకు సరిపోతోంది. చిల్లి గవ్వ కూడా మిగలడం లేదు.

**- మంగమ్మ, పూలతోట రైతు, వాల్మీకిపురం**

### భారంగా కమీషన్లు, తరుగు



పండించిన చామంతి, బంతి పూలను మార్కెట్‌కు తరలించాలంటే భయంగా ఉంది. వందకు రూ.15 కమీషన్, 30 కిలోల పూల సంచికి 3 కేజీల తరుగు తీసుకుంటున్నారు. ఇలా నాలాంటి రైతులకు మార్కెట్‌లో తీవ్ర నష్టం కలుగుతోంది. దూరం తీసుకెళ్లి అమ్ముకోలేక స్థానికంగా ఉన్న ప్రైవేటు మండీలనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక వ్యాపారస్థులు మార్కెట్ ధర కంటే రూ.10 తక్కువగా పట్టీలు కట్టడం వల్ల రైతుకు మరోవిధంగా నష్టం జరుగుతోంది. కమీషన్లు, తరుగులు లేకుండా చేస్తే, మార్కెట్ ధర చేతికి అందేలా చూడాలి. వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానం చేస్తే రైతులతో పాటు కౌలు రైతులకూ కాసింత ఊరట లభిస్తుంది.

**- చుక్కా నరసింహులు, చామంతి రైతు, అయ్యవారిపల్లె, వాల్మీకిపురం**

# తిరుమలలో మూడంచెల భద్రత!

**(మొదటి పేజీ తరువాయి)** దర్శనానికి వచ్చే భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు వీలుగా వైకుంఠం కాంప్లెక్స్ వద్ద నాలుగు కంపార్ట్‌మెంట్లలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా రానున్న రోజుల్లో అటు నేరస్థులకు అడ్డుకట్ట వేయడంతోపాటు ఇటు దళారీ వ్యవస్థను అరికట్టేందుకు తితిదే అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు రూ.8 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

తిరుమలకు నిత్యం 75వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తుంటారు. తిరుమలకు అలిపిరితోపాటు శ్రీవారి మెట్టు మార్గం నుంచి వచ్చే భక్తులను తనిఖీ చేస్తున్నారు. తనిఖీలను మరింత పకడ్బందీగా చేయాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్‌వో రవికృష్ణ తలచారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం తిరుమలకు మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి అంచెలో తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే భక్తులను, యాత్రికులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పాత నేరస్థులను కిందనే నిలువరించాలనే అంశంపై చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతాల్లో నేరస్థుల ముఖాలను గుర్తించే కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిని సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేస్తారు. ఒక్కసారి డేటాబేస్‌లో ఉన్న నేరస్థుల డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (డీఎఫ్ఎండీ) నుంచి వస్తుండగానే వారిని గుర్తించి శబ్దం వస్తుంది. వెంటనే అదుపులోకి తీసుకుని తిరుమలకు వెళ్లకుండా నిరోధించే ఆస్కారం ఉంటుంది. ఇప్పటి వరకు తిరుమల పోలీసులు, విజిలెన్స్, తిరుపతి పోలీసుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం దొంగతనాలు, దోపిడీలు, దళారీగా అరెస్టయిన రెండువేల మంది వివరాలు అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు అటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల్లోని నేరస్థుల వివరాలను సేకరిస్తున్నారు. తీవ్రవాదులకు సంబంధించిన వివరాలు నిఘా వర్గాల నుంచి తీసుకోనున్నారు. ముందుగా 20 కెమెరాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

### మాడ వీధుల్లో విక్రయదారులకు అడ్డుకట్ట

రెండో అంచెలో తిరుమల మాడవీధుల్లోకి విక్రయదారులను రాకుండా నిరోధించడంతోపాటు అనుమానితులను గుర్తించి వారిని తనిఖీ చేసే చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. తిరుమలలోని కమాండ్ కంట్రోల్ గదిలో ఇప్పటి వరకు కేవలం ఇద్దరు నామమాత్రంగా పనిచేస్తుండేవారు. ఏదైనా ఘటన జరిగిన తర్వాత వీరు సీసీ కెమెరాల ఫుటేజీని మాత్రమే పరిశీలిస్తారు. కొత్తగా సీవీఎస్‌వోగా బాధ్యతలు తీసుకున్న రవికృష్ణ ఈ విధానాన్ని గమనించి పలు మార్పులు చేశారు. ఒక్కో షిఫ్టులో ఐదుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. రానున్న రోజుల్లో వీరి సంఖ్యను పదికి పెంచనున్నారు. వీరు అనుమానం వచ్చిన అంశాలను పరిశీలించి వెంటనే సంబంధిత ఏవీఎస్‌వోకు సమాచారం అందించాలి. వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. మాడ వీధుల్లో అనుమానితులను గుర్తించి వెంటనే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ ఎక్కడైనా అలసత్వం ప్రదర్శిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇలా తిరుమలలోని అన్ని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ గదిలోని కంప్యూటర్ల ద్వారా క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు.

### విమానాశ్రయం తరహాలో....

మూడో అంచెలో విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టే విధానంలో తిరుమలలోనూ భద్రత ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మహాద్వారం వద్ద రెండు ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో క్యూకాంప్లెక్స్‌ల వద్దనే నాలుగు కంపార్ట్‌మెంట్లలో పూర్తిస్థాయి తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. మొత్తం నాలుగు కంపార్ట్‌మెంట్లలో 32 డీఎఫ్ఎండీలు, 8 బ్యాగుల స్కానర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే పూర్తిస్థాయిలో తనిఖీ చేసి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. తద్వారా మహాద్వారం వద్ద రద్దీని నియంత్రించనున్నారు.

### వాహనాలు గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్..

వాహనాల నంబర్ ప్లేట్లను సులభంగా గుర్తించే విధంగా ఉన్న సాఫ్ట్‌వేర్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనాలు తిరుమల కొండ మీదకు వెళ్లినా నాలుగైదు రోజుల వరకు కిందికి రావట్లేదని అధికారులు గుర్తించారు. కొండమీద కూడా ఎక్కడ ఉంటుందనేది సరిగ్గా తెలియట్లేదు. ఈ నేపథ్యంలో ఇటువంటి వాహనాలను గుర్తించేందుకు అనువుగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కసారి ఇలాంటి వాహనం కొండ మీదకు వెళ్లి తిరిగి నాలుగైదు రోజుల తర్వాత కిందికి దిగితే అక్కడే దాన్ని గుర్తించే విధంగా భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

### పట్టుగూళ్ల ధరలు

| | |
|---|---|
| కనిష్ఠం | 324.90 |
| గరిష్ఠం | 390.00 |
| సగటు | 354.55 |

### టమోటా ధరలు

| | |
|---|---|
| ఏ.గ్రేడ్ | 32.00-44.00 |
| బి.గ్రేడ్ | 18.00-30.00 |



ద్రవిడ విశ్వవిద్యాలయంలోని దేశిసిరి ప్రాంగణ ప్రవేశద్వారం



దేశిసిరి ప్రాంగణంలో పాండవుల విగ్రహాలు



పురాతన వస్తు ప్రదర్శనశాల

# జానపదం... ద్రవిడ పథం

**జానపదానికి కొత్త ఊపిరి పోయడానికి కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని 'జానపద గిరిజన అధ్యయన కేంద్రం' విశేషంగా కృషి చేస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇక్కడ చేస్తున్న పరిశోధనలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఏటా నిర్వహించే జానపద ఉత్సవాలతో కేంద్రం కృషి అందరి దృష్టిలో పడుతోంది.**

☛ ద్రవిడ విశ్వవిద్యాలయంలో అధ్యయన కేంద్రం ☛ సంప్రదాయ కళలపై విస్తృతంగా పరిశోధనలు

**కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే:** పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో అంతరించి పోతున్న జానపద కళలను సజీవంగా నిలిపేందుకు అక్కడక్కడ జరుగుతున్న ప్రయత్నాల్లో కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం కీలక భూమిక పోషిస్తోంది. నిత్య జీవితంలో యాంత్రీకరణ పెరిగిపోతుండటంతో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగైపోతున్నాయి. ఈ నేపథ్యంలో జానపద కళలను పరిరక్షించేందుకు విశ్వవిద్యాలయం ముందడుగు వేస్తోంది. ఇక్కడ 2003లో జానపద గిరిజన అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా గిరిజనుల జీవన విధానం, గిరిజనుల కళలను అధ్యయనం చేస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో అంతరించి పోతున్న కళలు.. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నారు.

## 18 పరిశోధనలకు పట్టాలు

జానపద గిరిజన అధ్యయన కేంద్రంలో ప్రస్తుతం 10 మంది విద్యార్థులు జానపద కళలపై పరిశోధనలు చేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు శిల్పకళ, రంగస్థల నాటకం, గిరిజనుల స్థితిగతులు, అభివృద్ధి, సాహిత్యం తదితర అంశాలపై పరిశోధనలకు తొమ్మిది మందికి ఎం.ఫిల్., మరో తొమ్మిది మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై ఈ కేంద్రం ద్వారా క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేస్తున్నారు. వ్యవసాయానికి గతంలో వినియోగించిన పరికరాలను సేకరించారు. మల్లన్న దేవుడి సంప్రదాయాలు, దొమ్మర కులస్తుల ఆటలు, సంస్కృతి, కళాకారుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై పరిశోధనలు చేశారు. రాష్ట్రంలో చెంచులు, లంబాడీలపై పరిశోధనలు చేస్తున్నారు. ఎల్లమ్మ పురాతన గాథ ప్రత్యేకత, మౌఖిక పురాణాలు, కులపురాణాలతోపాటు పలువురు కళాకారులపై పరిశోధనలు జరుగుతున్నాయి.

## పల్లెకు ప్రతిబింబం

విశ్వవిద్యాలయంలో చుట్టూ గుట్టలు.. పచ్చని చెట్ల నడుమ పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించేలా దేశిసిరి ప్రవేశద్వారం కనిపిస్తుంది. అక్కడ ఏర్పాటు చేసిన రాతికట్టడంతోపాటు ఎద్దులబండి చక్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రాంగణంలో పాండవుల విగ్రహాలు, ద్రావిడమాత, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. పురాతన వస్తువులను భద్రపరిచేందుకు నిర్మించిన ప్రదర్శనశాల గోడలపై గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. ఏటా ఆగస్టు 22న ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రాష్ట్రాల కళాకారులను ఆహ్వానించి వారి కళలను ప్రదర్శించే అవకాశం కల్పించడంతో పాటు సన్మానిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ ఉద్యోగినులు సంప్రదాయ దుస్తులు ధరించి ద్రావిడమాత ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పిస్తారు. సంప్రదాయ పిండి వంటలతో సందడి చేస్తారు.

### పర్థాన్ గిరిజన గాయకులపై పరిశోధించా



సమాజానికి దూరంగా అడవుల్లో తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలతో జీవించే పర్థాన్ గిరిజనుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితంపై అధ్యయనం చేశాను. మరుగున పడిపోతున్న వారి కళలు, పాటలు, కథలను సేకరించా. అడవుల్లో లభ్యమయ్యే వనమూలికలతో ఎంతటి వ్యాధినైనా నయం చేసుకునే సత్తా వీరికి ఉంది. పర్థాన్ గిరిజనులు ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది.

**- డాక్టర్ ఎస్.పాల్‌రాజ్, పీహెచ్‌డీ గ్రహీత, ద్రవిడవర్సిటీ**

### ప్రోత్సాహం అవసరం



దక్షిణాది రాష్ట్రాల్లో ఎందరో కళాకారులు ఉన్నారు. వీరికి తగిన ప్రోత్సాహం లేక ప్రత్యామ్నాయం జీవనంపై దృష్టి సారిస్తున్నారు. చిత్తూరు జిల్లా మహాభారత ఉత్సవాలకు ప్రసిద్ధి. వన్నెకుల క్షత్రియులు ఏటా మహాభారత ఉత్సవాలను పండుగలా నిర్వహిస్తారు. కాళహస్తి కలంకారి, చెక్కబొమ్మల తయారీ, నెమలి ఆట కళాకారులు ఉన్నారు. వీరిని ప్రభుత్వం ప్రోత్సహించాలి. జానపద కళలను సంరక్షించుకునేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**-ప్రొఫెసర్ శ్యామల, జానపద గిరిజన అధ్యయనశాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం**

### ప్రపంచానికే ఆదర్శం



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. వీటిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. జానపద కళాకారుల ఆర్థిక పరిస్థితులను అభివృద్ధి చేయకపోతే భవిష్యత్తులో కళలు అంతరించిపోయే ప్రమాదం లేకపోలేదు.

**- ఆచార్య ఎం.ఎన్.వెంకటేశ, జానపద గిరిజన అధ్యయన శాఖాధిపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం**

# రేడియాలజీ రంగంలో ఆధునికతకు పెద్దపీట

● నిమ్స్ మాజీ సంచాలకులు డాక్టర్ కాకర్ల ● ముగిసిన రాష్ట్ర రేడియాలజిస్ట్‌ల సదస్సు

**తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే:** రేడియాలజీ రంగం నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో రోగులకు వ్యాధినిర్ధారణ ప్రక్రియ సులభతరమవుతోందని నిమ్స్ మాజీ సంచాలకులు డాక్టర్ కాకర్ల సుబ్బారావు అన్నారు. గత రెండు రోజులుగా తిరుచానూరు రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్లో జరుగుతున్న రాష్ట్ర రేడియాలజిస్ట్‌ల సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. రెండోరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కాకర్ల సుబ్బారావు మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో చీకటి గదిలో ఎక్స్‌రే ఫిల్మ్‌లను డెవలప్ చేసి తెలుసుకునేవారమన్నారు. ప్రస్తుతం అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్‌సీటీ వంటి అత్యాధునిక పరికరాలతో రేడియాలజీ రంగం అభివృద్ధి చెందిందని తెలిపారు. తన పేరుపై స్థాపించిన కాకర్ల గోల్డ్ మెడల్ ఓరేషన్‌ను తన శిష్యుడు నిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామ్మూర్తికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఐఆర్ఐఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ డి.శ్రీహరిరావు మాట్లాడుతూ రేడియాలజీ.. వ్యాధి నిర్ధారణలో కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. రేడియాలజీలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి దేశవ్యాప్తంగా ఉన్న రేడియాలజిస్ట్‌లతో ఈ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఉదర సంబంధిత వ్యాధుల నిర్ధారణలో రేడియాలజిస్ట్‌ల పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించామన్నారు. వైద్యులు ఆధునిక రేడియాలజీ రంగంపై రూపొందించిన పోస్టర్ ప్రజెంటేషన్ చేశారన్నారు. నిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామ్మూర్తికి.. తన పేరిట ఏర్పాటుచేసిన గోల్డ్‌మెడల్‌ను డాక్టర్ కాకర్ల సుబ్బారావు అందజేసి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను బహుకరించారు. అనంతరం రేడియాలజిస్ట్‌లు, వైద్యవిద్యార్థులకు ఎక్స్‌రేల పరిశీలన, క్విజ్‌పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రేడియాలజిస్ట్‌ల సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.రాజారెడ్డి, కార్యదర్శి డాక్టర్ కిషోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎ.వై.లక్ష్మి, జాతీయ కార్యదర్శి డాక్టర్ అమరనాథ్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన రేడియాలజిస్ట్‌లు పాల్గొన్నారు.




నిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామ్మూర్తికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న నిమ్స్ మాజీ సంచాలకులు డాక్టర్ కాకర్ల సుబ్బారావు

# పదోన్నతులతో డీఈవో పోస్టుల భర్తీ

## శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి

**పీలేరు ఆర్ఎస్‌మెయిన్, న్యూస్‌టుడే :** ప్రభుత్వం త్వరలో జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తుందని శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా రద్దు చేయడం దారుణమన్నారు. ఉపాధ్యాయులకు కొత్త సర్వీసు నిబంధనలు అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలను వేగవంతం చేసిందని అందులో భాగంగా ఏర్పాటుచేసిన కమిటీ త్వరలో సమావేశమై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నదని పేర్కొన్నారు. నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌ను శాసనమండలిలో చర్చించి రాజకీయ పార్టీల మద్దతు పొంది ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఆదర్శ పాఠశాలలను, అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోకి తెచ్చి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నూతన ప్రతిపాదనలు, చట్టం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలమైన పాఠశాలల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలను, ఎమ్మెల్సీలను కలుపుకొని పోయి విద్యారంగ సమస్యలపై, ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు రామచంద్ర, రమేష్, మహేశ్వరరెడ్డి, పోతయ్య, సుబ్రమణ్యం, రహత్‌భాష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

# తిరుపతి

## మంచిమాట



☛ ధీరులూ, సమర్థులైన కార్యసాధకులకే అదృష్టం అనుకూలిస్తుంది. దిగంతాలను తాకే వీరోచితమైన ధైర్యోత్సాహాలతో ప్రయత్నిస్తూ కడదాకా వేచి ఉండే వారే అద్భుతాలను సుసాధ్యం చేయగలరు. – స్వామి వివేకానంద

## 80 వేల మందికి దర్శనం

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవారిని 80 వేల మంది భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచి అర్ధరాత్రి వరకు 80,248 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తితిదే తెలిపింది. అదే విధంగా ఆదివారం తెల్లవారు జామున మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 64,433 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సమయానికి సర్వదర్శనానికి 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామి సన్నిధిలో మహాలఘు దర్శనం అమలు చేశారు.

## ఆదిభట్ల విగ్రహానికి ఘనంగా పుష్పాంజలి

**తిరుపతి(సాంస్కృతికం), న్యూస్‌టుడే:** హరికథ పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాస 153వ జయంతిని నగరంలోని శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆదిభట్ల విగ్రహానికి ప్రిన్సిపల్ వైవీఎస్ పద్మావతి, హరికథా విభాగాధిపతి ఎంవీ సింహాచల శాస్త్రి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కళాశాల విద్యార్థులు బృందగానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వైవీఎస్ పద్మావతి మాట్లాడుతూ సంగీత, సాహిత్యాలను సరితూచిన త్రాసు నారాయణ దాసు అని తిరుపతి వేంకటకవులు, శ్రీశ్రీ లాంటి మహానుభావులు కొనియాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, ఇతర అధికార ప్రముఖులు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఏఈఆర్ డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న శిక్షకురాలు హారిక

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే:** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలలో తనదైన శైలిలో దూసుకుపోయే తత్వం అలవర్చుకున్నప్పుడే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.లోకనాథం, శిక్షకురాలు వి. హారిక పిలుపునిచ్చారు. స్థానిక వరదరాజనగర్‌లోని ఏఈఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత చదువుతో బాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలపై ఎంతో పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో తనదైన ప్రతిభ చూపితే తప్ప అవకాశాలు అందిపుచ్చుకోవడం కష్ట తరంగా మారిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పించి అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో వివిధ సెల్‌ఫోన్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయని.. ఈ ప్రాంతం విద్యాకేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## స్టూడెంట్ ప్రీమియర్ లీగ్ ఎమరాల్డ్స్ సొంతం

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** తిరుపతిలో జరిగిన స్టూడెంట్ ప్రీమియర్ లీగ్‌ను ఎమరాల్డ్స్ జట్టు కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. స్థానిక తుమ్మలగుంట వైఎస్ఆర్ క్రీడామైదానంలో హ్యాపీ ఈవెంట్స్, వెడ్డింగ్ ప్లానర్స్ నిర్వహించిన పోటీలో ఆదివారం ఎమరాల్డ్స్ జట్టు తనదైన శైలిలో ప్రతిభ కనబరిచి టోర్నీని తన సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. స్టూడెంట్ ప్రీమియర్ లీగ్-2 లో పాల్గొనడానికి ఇంటర్ విద్యార్థులు చరవాణి 7995636162 సంప్రదించవచ్చన్నారు.



విజేతలతో టోర్నీ నిర్వాహకుడు కొల్లా రాకేష్

# స్వచ్ఛ విద్యాలయం..

- 79శాతం గ్రేడింగ్
- ఉర్దూ పాఠశాల ఎంపిక
- అందివచ్చిన కేంద్ర వరం

**ప్రపంచప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక నగరం.. స్మార్ట్ సిటీగా ఎంపికైంది.. ఇటీవలే తిరుపతి మహానగరాన్ని కేంద్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంది... ఇలా అభివృద్ధివైపు అగుడులేస్తున్న తిరుపతికి మరో కేంద్రస్థాయి అవార్డు దక్కింది.. నెహ్రూనగర్‌లోని నగరపాలక ఉర్దూ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 79 శాతంతో స్వచ్ఛ విద్యాలయ పురస్కారం దక్కింది.**

**తిరుపతి(విద్య), న్యూస్‌టుడే**



నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల

**నె**హ్రూనగర్‌లో సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. జన సాంద్రత అధికం. చిన్నరోడ్లు కావడంతో మొదట ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తిరుపతి మున్సిపాలిటిగా ఉన్న సమయంలో నెలకొల్పారు. విద్యార్థులు పెద్దవుతున్న తరలివస్తున్న సమయాన మరెక్కడా ఉర్దూ పాఠశాలలు లేకపోవడంతో దీన్ని ఏర్పాటుచేశారు. ఆపై నగరపాలక సంస్థ ఏర్పడిన తరవాత ఉన్నత పాఠశాలగా మార్పు చేశారు. నాటి నుంచి నేటివరకు ఈ పాఠశాల ఎన్నోవిధాల అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ఈ ఉన్నత పాఠశాలలో అయిదుగురు ఉపాధ్యాయులు, ఆరు తరగతి గదులు, ఒక ఆయా, 100మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల విద్యార్థులు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. 2016-17 విద్యా సంవత్సరంలో తిరుపతి నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులు 92శాతం ఉత్తీర్ణతతో 9.30జీపీఏ పాయింట్లతో ప్రథమస్థానంలో నిలిచారు. ఇటు పరిశ్రుభత.. అటు చదువుతో బాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఫలితంగా స్వచ్ఛ విద్యాలయ పురస్కారం దక్కించుకుంది.

### ప్రత్యేక శ్రద్ధ..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించే ప్రభుత్వ పాఠశాలలను అర్బన్, రూరల్‌గా విభజించి సర్వే నిర్వహించారు. ఇందులో వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్‌వాష్, టాయిలెట్ల పరిశుభ్రత, తాగునీటి పరిశుభ్రతను పాటిస్తున్న పాఠశాలను పరిశీలించి వాటికి నూరుశాతం గ్రేడ్‌ను అందజేస్తారు. ఈ అంశాలతో బాటు మూడు జోన్లుగా(ఎరుపు, నీలం, పచ్చరంగు) పాఠశాలలను పరిశీలిస్తూ జిల్లా, రాష్ట్ర, కేంద్రస్థాయి కమిటీలు పలుసార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీటిలో నగరపాలక ఉర్దూ పాఠశాల 79శాతంతో నీలం రంగు జోనుగా గుర్తించి ఈ పురస్కారం అందించారు. ఈ పాఠశాలలో బోరు నుంచి వచ్చిన నీటిని సీకరిస్తారు, మరుగుదొడ్లు నిత్యం శుభ్రంగానే ఉంటాయి, మరుగుదొడ్లు వెళ్లిన సమయంలో చేతులు కడగడానికి రెండు హ్యాండ్‌వాష్ బేసిన్లు, ఆహారం తీసుకోవడానికి రెండు హ్యాండ్‌వాష్ బేసిన్లు ఏర్పాట్లు చేశారు. పాఠశాల లకు వచ్చే ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు తప్పక క్రమపద్ధతిలో చెప్పులు వదిలి లోనికి రావాలి. ప్రతిరోజు తరగతి గదిని ఆయాచే శుభ్రపరుచకోవాలి. మరుగు దొడ్లకు వెళ్లిన ప్రతిసారి తప్పక చేతులు శుభ్రపరచుకోవాలి. మధ్యాహ్న భోజనానికి వెళ్లే సమయంలో ప్లేట్లను శుభ్రపరచి క్రమపద్ధతిలో ఆహారం తీసుకుని, అందరూ లైనుగా కూర్చొని తినాలి. ఆహారం కింద పడితే వెంటనే ఆయాచే శుభ్రపరచేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు.



క్రమశిక్షణలో చెప్పులు వదులుతున్న విద్యార్థులు




పరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

### పాఠశాల కమిటీ ద్వారా పరిశుభ్రత

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి సమక్షంలో ప్రతి తరగతిలోని విద్యార్థి ఆసక్తికి తగినట్లు ఒక్కో కమిటిగా నియమించి వారికి కొన్ని సూచనలు ఇవ్వడమే కాక, సమావేశాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా పరిశుభ్రత, స్వచ్ఛ పాఠశాల, లైబ్రరీ, స్పోర్ట్స్ కమిటీలను ఎంపిక చేశారు. ఇందులో ఆయా విద్యార్థులు కమిటీ నిబంధనలను అనుసరిస్తూ వారి పని వారు చేసుకుపోతారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలతో బాటు అన్ని అంశాలపై అవగాహన ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

### ఆనందంగా ఉంది



**మా** పాఠశాలకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారం వచ్చిందంటే మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు పాఠశాల పరిశుభ్రతకు సహకరిస్తారు. అందుకే పాఠశాలకు ఈ అవార్డు దక్కింది. గతంలో రాష్ట్రస్థాయి అవార్డులు రావడం సంతోషంగా ఉన్నా.. ప్రస్తుతం కేంద్ర అవార్డు రావడం గర్వంగా ఉంది.

**- ఎస్.దిల్‌షాద్‌బీ, ప్రధానోపాధ్యాయురాలు**

### విద్యార్థుల క్రమశిక్షణతో అవార్డు సొంతం



**పా**ఠశాలలో చదివే ప్రతి విద్యార్థి చెప్పిన విషయాలను క్రమశిక్షణతో నేర్చుకుంటూ ఆచరిస్తారు. అందుకే మాకు ఈ అవార్డు వచ్చింది. కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖులు వచ్చిన ప్రతిసారీ మా పాఠశాల పరిశుభ్రత బాగుందనే మాట ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. ఈ అవార్డు రావడానికి కారణం విద్యార్థులు కనుక పురస్కారం వారికే దక్కాలి.

**-ఎస్.ముజిబుర్ రెహమాన్, ఉపాధ్యాయుడు**





కుండపోత వర్షంతో జలమయమైన వీధులు

## తిరుపతిలో కుండపోత వర్షం

**తిరుపతి(కొర్లగుంట), న్యూస్‌టుడే:** తిరుపతి నగరాన్ని ఆదివారం రాత్రి కుండపోత వర్షం ముంచెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రాత్రి ఆకస్మికంగా జోరు వాన కురిసింది. నగరంలో ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడి ఉష్ణోగ్రతలు 30-32 సెల్సియస్ డిగ్రీలకు పడిపోయాయి. అయితే ఆదివారం ఉష్ణోగ్రతలు పెరిగినా రాత్రి కురిసిన వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం లభించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గంట పాటు నిరంతరాయంగా కుండపోతగా వర్షం కురడంతో నగరంలోని రహదారులు జలమయం అయ్యాయి. రెండు, మూడు సార్లు పిడుగుల పడ్డ శబ్దం రావడంతో నగరవాసులు ఉలిక్కిపడ్డారు. గంటపాటు రహదారుల్లో రాకపోకలు స్తంభించాయి

## కులనిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యం

**తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే:** కులనిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని ప్రముఖ అంబేడ్కరిస్టు దుడ్డు ప్రభాకర్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఆదివారం సాంకేతిక విద్యాశాఖ రాష్ట్ర పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో కులనిర్మూలనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన దుడ్డు ప్రభాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానాలతో దేశంలో అన్ని వర్గాల సంక్షేమం జరగాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు అంబేడ్కర్ సూచించిన విధానాలతో ముందుకెళ్లాలన్నారు. మరో అతిథి పరమశివం మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామారావు, మరియదాసు, షామీర్‌బాషా, ఉదయ్, నాగేంద్ర, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్

# తిరుపతి






మట్టి విగ్రహాలపై అవగాహనపై ర్యాలీలో విద్యార్థులు

## మట్టి వినాయకుడిని పూజిద్దాం

**తిరుపతి(విద్య), న్యూస్‌టుడే:** పర్యావరణానికి హాని కలిగించే కాలుష్యకారర వినాయక విగ్రహాలను నిలిపివేసి, మట్టి విగ్రహాలను పూజించాలని సాయిశ్రీ పాఠశాల కరస్పాండెంట్ కుప్పయ్య పిలుపునిచ్చారు. స్థానిక జనార్థనకాలనీలోని సాయిశ్రీ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి విగ్రహాలను చేతపట్టి, వినాయకుడి వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తితిదే జేఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

## వినాయక నిమజ్జనానికి సహకరించాలి

**తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే:** తిరుపతిలో అత్యంత వైభవంగా నిర్వహించే వినాయక చవితి మహోత్సవాలు, సామూహిక నిమజ్జనానికి తితిదే ఏర్పాట్లును పూర్తిచేయాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు తితిదే తిరుపతి జేఈవో పోలా భాస్కర్‌ను కోరారు. స్థానిక తితిదే పరిపాలనా భవనంలో ఆదివారం జేఈవోను కలిసి ఏటా నిమజ్జనానికి తితిదే కల్పిస్తోన్న ఏర్పాట్లను తక్షణమే చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, గోపినాథ్, శ్యామ్, మురళి, శీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

## ఎన్నికల హామీలను అమలు చేయాలి

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య(జీపీస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శంకర్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక జీపీఎస్ కార్యాలయంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని, అభివృద్ధిన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల సమయాన్ని కాలయాపన చేశారని ఆరోపించారు. గిరిజనులకు అనేక హామీలను గుప్పించిన ప్రభుత్వం నేటికి ఒక్క హామీలను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం గిరిజనులకు చేసిన మోసాన్ని ఎండగట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులను చైతన్య పరిచి వాటి సాధన దిశగా జీపీఎస్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకో బహిరంగ సభను నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జీపీఎస్ నేతలు డాక్టర్ కె.శంకర్ నాయక్, భాస్కర్ నాయక్, వినోద్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 23న హుండీ ఆదాయం లెక్కింపు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 23వ తేదీన హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి, అమ్మవార్ల ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతామూర్తుల హుండీలను లెక్కింపు చేయనున్నట్లు వివరించారు. లెక్కింపునకు వచ్చే ఉద్యోగులు నిర్దేశిత వస్త్రధారణతో లెక్కింపునకు హాజరుకావాలని కోరారు.

## తీరిన దాహార్తి..

- ★ అందరి కోసం
- ★ అందుబాటులో శుద్ధజలం
- ★ మహిళా వర్సిటీలో ఏర్పాటు

**మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు. విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేస్తున్నారు. వర్సిటీలో శుద్ధినీటి అవసరం గుర్తించిన అధికారులు గతంలో చిన్నపాటి ఆర్వో మిషన్లను ఏర్పాటు చేశారు. ఇవి సక్రమంగా పని చేయకపోవడం, తక్కువ శాతం నీటిని శుద్ధి చేస్తుండటంతో అధికశాతం శుద్ధి నీటిని అందజేసే కేంద్రీకృత శుద్ధి నీటి ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. బెంగళూరుకు చెందిన 'రాజు వేగేష్ణ సంస్థ' సహకారంతో వర్సిటీలో రూ.10లక్షలు వెచ్చించి నీటిశుద్ధి ప్లాంటును విజయవంతగా ప్రారంభించారు. లీటరు, అర లీటరు శుద్ధినీటి కోసం ఎదురుచూసే రోజులు పోయి ఏకంగా గంటకు వెయ్యి లీటర్ల చొప్పున, రోజుకు 24వేల లీటర్ల శుద్ధి నీటిని అందజేసే ప్లాంటును ఇటీవల వర్సిటీలో అధికారులు ప్రారంభించారు. దీంతో సిబ్బంది, విద్యార్థినులకు శుద్ధి నీటి కొరత తీరింది.



శుద్ధి నీటి ప్లాంటు



నీటిని శుద్ధి చేస్తున్న యంత్రాలు

### ● క్యాన్లతో పనిలేదు

వర్సిటీలో మొత్తం 50విభాగాలున్నాయి. గ్రంథాలయం, ఇంజినీరింగ్ కళాశాల, పరిపాలనా భవనం ఇలా అన్నిచోట్ల శుద్ధి జలం అవసరం. గతంలో కొన్ని విభాగాల్లో మినీ ఆర్వో మిషన్లను ఏర్పాటు చేశారు. గంటకు 50లీటర్ల నీటిని శుద్ధి చేసే మిషన్లు 10, గంటకు 8లీటర్ల నీటిని శుద్ధి చేసే ఆర్వోలు 10 ఉన్నాయి. 4వేలకు పైగా విద్యార్థినులు, వెయ్యికి పైగా బోధన, బోధనేతర సిబ్బంది ఉండటంతో ఈ నీరు అంతగా సరిపోయేది కాదు. ఆర్వోలు అప్పుడప్పుడూ సక్రమంగా పని చేయకపోవడంతో బయటి ప్లాంట్ల నుంచి శుద్ధి నీటి క్యాన్లను తెప్పించుకునే వారు. రోజుకు దాదాపు 500 లీటర్ల శుద్ధి జలం అవసరం ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వర్సిటీ రూ.5లక్షలు, బెంగళూరుకు చెందిన రాజు వేగేష్ణ సంస్థ రూ.5లక్షలు మొత్తం రూ.10లక్షలు వెచ్చించి నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేశారు.

### ● రోజుకు 24వేల లీటర్ల శుద్ధ జలం

గతంలో మిని ఆర్వోలు ఏర్పాటు చేశారు. వీటివల్ల తగినంత నీరు లభించక పోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కొందరు బోధన, బోధనేతర సిబ్బంది ఇంటివద్ద నుంచే శుద్ధినీరు తెచ్చుకునేవారు. వర్సిటీకి వచ్చేవారు, విద్యార్థినుల తల్లిదండ్రులు తాగునీటికి ఇబ్బంది పడేవారు. నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధినీటి ప్లాంటుతో కష్టాలు తీరాయి. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అందరికీ అందుబాటులో ఉండేలా ఇక్కడ ప్లాంటును ఏర్పాటు చేశారు. గంటకు వెయ్యి లీటర్ల చొప్పున రోజుకు 24వేల లీటర్ల శుద్ధి నీరు ఈ ప్లాంటు ద్వారా లభిస్తోంది. ప్లాంటులో రెండు బేసిన్స్ పెట్టడం వల్ల ఒకేసారి పది మంది నీటిని పట్టుకునే అవకాశం ఉంది. నీటి క్యాన్లు, శీసాలలో నీటిని నింపుకునేలా ఏర్పాటు చేశారు.

### ● వృథా నీటిని ఉపయోగంలోకి

రోజుకు 24వేల లీటర్ల శుద్ధి జలం తయారవడానికి కనీసం 50వేల లీటర్లకుపైగా నీరు వృథా అవుతుంది. ఈ నీటిని వృథా చేయకుండా అధికారులు ఉపయోగంలోకి తెచ్చారు. నీటిని శుద్ధి చేసే ప్రక్రియలో వచ్చే వృథా నీటిని ప్రత్యేక సంపుల్లోకి మళ్లించి ఆ నీటిని విద్యార్థినులు మరుగుదొడ్లకు ఉపయోగించడానికి, దుస్తులు ఉతకడానికి ఉపయోగపడేలా తాత్కాలిక ఏర్పాటు చేశారు. త్వరలో ప్లాంటు వద్ద పూలమొక్కలతో గార్డెన్ ఏర్పాటు చేసి వృథా నీటితో గార్డెన్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### అందరికీ శుద్ధ జలం అందజేయాలనే..

బయటనుంచి తెప్పించే శుద్ధి జలంపై అక్కడక్కడా అపోహలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని వర్సిటీ పర్యవేక్షణలోనే శుద్ధి నీటిని తయారు చేసి, సిబ్బంది, విద్యార్థినులు, వర్సిటీకి వచ్చే వారందరికీ శుద్ధి నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్లాంటు ఏర్పాటు చేశాం. బెంగళూరుకు చెందిన రాజు వెగేష్ణ సంస్థ వారు 12ఏళ్ళ క్రితం వర్సిటీలోని కల్యాణి, స్వర్ణముఖి, గంగోత్రి, శ్రవంతి వసతి గృహాల్లో శుద్ధి నీటి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సిబ్బంది, విద్యార్థినులకు ఉప యోగపడుతుందని ప్లాంటు ఏర్పాటు చేయాలని ఈ సంస్థను కోరాం. ఆ సంస్థ ఒప్పుకుని ప్లాంటు ఏర్పాటుకు రూ.5లక్షలు అందజేసింది. మిగిలిన రూ.5లక్షలు వర్సిటీ వెచ్చించి ప్లాంటును ఏర్పాటు చేశాం. భవిష్యతులో ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఒక ప్లాంటును, వర్సిటీలో మరో ప్లాంటును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. వర్సిటీలోని సిబ్బంది, విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ స్వచ్ఛమైన, శుద్ధి జలాన్ని అందించాలనే లక్ష్యంతో ప్లాంటు ఏర్పాటు చేశాం. దీని ఏర్పాటుకు రెక్టార్, రిజిస్ట్రార్, ఇంజినీర్లు ఎంతో కృషి చేశారు. అందరి సహకారంతో వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడుపుతాం.



**-ఆచార్య వి.దుర్గాభవాని, ఉపకులపతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయం**

## డాక్టరేట్లు ప్రదానం

**తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థి సి.ప్రకాశరావుకు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఎన్హాన్సింగ్ ది సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ క్వాలిటీ త్రూ ఆటోమెటిక్ టెస్ట్ సూట్ జనరేషన్ అండ్ ప్రియారిటైజేషన్ టెస్టింగ్ టూల్స్' అనే అంశంపై విశ్రాంతాచార్యులు పి.గోవిందరాజులు మార్గదర్శకత్వంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించి నందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సీఈ సుధాకర్ పేర్కొన్నారు.



ప్రకాశరావు

### రాజేంద్ర ప్రసాద్‌కు..

ఎస్వీయూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి టి.రాజేంద్ర ప్రసాద్‌కు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఏ న్యూ టెక్నిక్ ఆఫ్ ఫేస్డ్ ఎరె యాంటినా క్యారెక్టరైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ డిజిటల్ రిసీవర్ అండ్ ట్రాన్స్‌మిటర్ కంట్రోలర్ ఫర్ ఎంఎస్‌టీ రాడార్' అనే అంశంపై ఆచార్య పి.సత్యనారాయణ, డాక్టర్ వీకేఆనందన్ సంయుక్త మార్గదర్శకత్వంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సీఈ సుధాకర్ పేర్కొన్నారు.



రాజేంద్ర ప్రసాద్



శిల్పారామంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శన

## అలరించిన భరతనాట్య ప్రదర్శన

**తిరుపతి (నగరం), న్యూస్‌టుడే:** తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. ఆదివారం తిరుపతికి చెందిన లక్ష్మీసరస్వతి బృందం కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా శ్రీమన్నారాయణ.., పుష్పాంజలి.., భో శంభో తదితర కీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. కళాకారులు లేఖ్య, తనుశ్రీ, జాహ్నవి, భావన, శరణ్య, హిమశ్రీ తమ నృత్యంతో అందరిని అబుర్బపరిచారు. కార్యక్రమం అనంతరం కళాకారులకు శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ జ్ఞాపికలు అందజేశారు.

## ముక్కంటి సేవలో అదనపు డైరెక్టర్ జనరల్

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పోలీసుశాఖ అదనపు డైరెక్టర్ జనరల్ కౌముది ఆదివారం వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఈయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఈయన ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం ఈయనకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో మోహన్, పీఆర్‌వో హరియాదవ్‌తో పాటు పట్టణ నిలయాధికారి సంజీవకుమార్ పాల్గొన్నారు.

### తిరుపతి సినిమా

- **ప్రతాప్ -** నేనే రాజు నేనే మంత్రి
- **జయశ్యామ్-** జయ జానకీ నాయక
- **విఖ్యాత్-** లై
- **బిగ్‌సినిమా-** లై
- **వేల్‌రామ్స్-** బాహుబలి 2
- **జగత్-** ఫిదా
- **శ్రీనివాస-** నక్షత్రం
- **కృష్ణతేజ-** నేనేరాజు నేనేమంత్రి
- **సంధ్య -** ఆనందోబ్రహ్మ
- **సీవీఎస్-** నక్షత్రం
- **మినీ ప్రతాప్-** ఫిదా
- **శ్రీనివాసతేజ-** అనబెల్లె
- **పీజీఆర్-** జయ జానకీ నాయక
- **తేజ -** గౌతమనంద
- **ఐ.ఎస్.మహల్-** శివగంగ
- **పళణి-** పోదువగ ఎన్ మనసు తంగం(త)



ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడానికి ఆర్చిలకు మెరుగులు దిద్దుతున్న కళాకారులు



చిత్తూరు-కాణిపాకం అగరంపల్లె కూడలి వద్ద ఉన్న స్వాగత తోరణానికి రంగులు వేస్తున్న దృశ్యం

# భక్తుడి సేవే.. భగవంతుడి తోవ...

- బ్రహ్మోత్సవాల్లో సామాన్యులకు పెద్దపీట
- 'న్యూస్‌టుడే'తో ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు



ఈవో పూర్ణచంద్రరావు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్లు ఆలయ ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు తెలిపారు. ఆలయంలో శుక్రవారం నుంచి సెప్టెంబరు 14వ తేదీ వరకు 21 రోజులపాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆదివారం ఈవో పూర్ణచంద్రరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ క్రమంలో వినాయకచవితి రోజున అభిషేకాలు పూర్తి చేసుకొని... వేకువజామున 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉచితం, రూ.10, రూ.51, రూ.100, వీఐపీలకు వేర్వేరుగా పత్యేకంగా క్యూలైన్లు రూపొందించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రముఖుల కోసం ప్రత్యేకంగా దర్శనం సమయం కేటాయించినట్లు వివరించారు. వినాయకచవితి రోజున ఉదయం 8 గంటలలోపు, రాత్రి 8 గంటల తర్వాత అనుమతిస్తున్నట్లు తెలిపారు. భక్తుల కోసం రూ.10 లడ్డూలు లక్ష, రూ.50 లడ్డూలు 20 వేలు, రూ.100 లడ్డూలు 10 వేలు, 15 వేల వడలను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ఆలయంలో ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేస్తున్నట్లు తెలియజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవ విశేషాలు తెలిపే గోడపత్రికలు రాష్ట్ర నలుమూలలు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రత్యేక సిబ్బంది ద్వారా పంపిణీ చేసినట్లు వివరించారు. గణేషదీక్ష చేపట్టిన భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. భక్తుల కాలక్షేపం కోసం ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథ, సాయంత్రం భక్తిగీతాలు, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, రాత్రుల్లో నాటకాలు, నాటికలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ఆర్జిత సేవలు, ప్రత్యేక పూజలు, ప్రమాణాలు రద్దు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో ఆకాంక్షించారు.

# వైభవంగా.. పల్లకీసేవ

## వర్షం కారణంగా పురవీధుల ఉత్సవం రద్దు


**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆఖరి రోజైన పల్లకీసేవను పురస్కరించుకుని ఆదివారం రాత్రి దేవతామూర్తులు మూడు పల్లకీల్లో కొలువుదీరారు. మొదటి పల్లకీలో జ్ఞానాంబిక అమ్మవారు, రెండో పల్లకీలో.. సోమస్కంధమూర్తి, మూడో పల్లకీలో శ్రీవల్లీ, దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులను విశేష అలంకరణలతో అలంకరించి పల్లకీల్లో ఉంచారు. వర్షం కారణంగా పురవీధుల ఉత్సవం రద్దయింది. దీంతో మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ ఆవరణలోనే ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం వస్తుందన్న ఆశపడ్డ భక్తులు నిరాశతో ముక్కంటి ఆలయానికి వెళ్లి ఉత్సవమూర్తులను సందర్శించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్యానాయుడు, ఈవో భ్రమరాంబతో పాటు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



ఆలయంలో ఊరేగుతున్న మూడు పల్లకీలు



విశేష అలంకరణలతో శ్రీసోమస్కంధమూర్తి



పల్లకీలో జ్ఞానాంబిక అమ్మ వారికి విశేష అలంకరణ


# 28,29 తేదీల్లో తిరుమలనంబి అవతారోత్సవాలు

**తిరుమల, న్యూస్‌టుడే:** ప్రముఖ శ్రీవైష్ణవాచార్యులు శ్రీతిరుమలనంబి అవతార మహోత్సవాలను ఈనెల 28, 29 తేదీల్లో తితిదే ఘనంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయ దక్షిణమాడ వీధి పక్కనున్న శ్రీతిరుమలనంబి సన్నిధిలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒకరైన శ్రీతిరుమలనంబి తిరుమలలో జన్మించారు. ఈయన శ్రీవేంకటేశ్వర స్వామివారికి తీర్థ కైంకర్యం చేసేవారు. శ్రీభగవద్రామానుజుల వారికి మేనమామ కూడా. ఉత్సవాల సందర్భంగా 28న తాతాచార్య వంశీకుల ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణం, వేదపారాయణం చేయనున్నారు. 29న తిరుమలనంబి సేవలు, కైంకర్యాలపై సదస్సు జరగనుంది. 24 మంది పండితులు సదస్సులో పాల్గొని ఉపన్యసిస్తారు.

# శ్రీ బొమ్మనచెరువు శ్రీరాములు గారికి జన్మదిన శుభాకాంక్షలు • Advt. Spl.

## విద్యార్థిదశ నుంచే నాయకత్వంపై ఆసక్తి

**మదనపల్లె (పట్టణం):** విద్యార్థి దశ నుంచే బొమ్మనచెర్వు శ్రీరాములుకు నాయకత్వంపై అమితమైన ఆసక్తి ఉండేది. రాజకీయాలన్నా, ప్రజల సమస్యలపై పోరాటాలు చేయాలన్నా ఆయనకు చాలా ఇష్టం. సమస్య ఏదైనా సరే, వెంట మంది వచ్చినా, రాకున్నా ప్రజలకు అండగా నిలబడే మనస్తత్వం ఆయనది. వాస్తవానికి శ్రీరాములు ఇంటిపేరు బద్దెల, అయితే ఆయన జన్మించిన ఊరు బొమ్మనచెర్వును ఇంటిపేరుగా మార్చుకుని ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. 1985 సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన ఆయన రాజకీయాలవైపు మళ్లారు. అప్పట్లో తెదేపాకు అనుబంధంగా ఉన్న తెలుగు విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నేషనల్ ఫ్రంట్ యూత్ కన్వీనర్‌గానూ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. ప్రతిపక్షపార్టీ హోదాలో తెదేపా ఉన్నప్పుడు అంతరాష్ట్ర జలవివాదం, విద్యుత్ సమస్యలపై పలు కార్యక్రమాలు చేశారు. శ్రీరాములు పనితీరుకు మెచ్చి పార్టీ అధిష్ఠానం తెదేపా మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పదవిని ఇచ్చింది. 2006 సంవత్సరంలో పట్టభద్రుల విభాగం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. 2014 సంవత్సరంలో తెదేపా అధికారంలోకి రాగానే శ్రీరాములు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సహకారంతో సేవా కార్యక్రమాలపైపు దృష్టి మళ్లించారు. ప్రధానంగా వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడుతున్న వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కును బాధితులకు అందిస్తున్న బొమ్మనచెర్వు శ్రీరాములు

## వృద్ధులు, దివ్యాంగులకు శ్రీవారి దర్శనం | రేపు 4 వేల మందికి అనుమతి

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనానికి వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక అవకాశం తితిదే కల్పిస్తోంది. మంగళవారంతో పాటు ఈనెల 29న 4 వేల మంది వంతున శ్రీవారి దర్శనానికి అనుమతించనుంది. ఉదయం 10 గంటలకు వెయ్యి, మధ్యాహ్నం రెండింటికి 2 వేలు, 3 గంటలకు వెయ్యి మంది వంతున అనుమతిస్తుంది. వీరికి ఉచిత టోకెన్లను ఉదయం 7 గంటల నుంచి మ్యూజియం ఎదుట ఏర్పాటు చేసిన కౌంటరు నుంచి జారీ చేస్తుంది. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు అవకాశం కల్పిస్తుంది. టోకెన్లు పొందిన యాత్రికులు కేటాయించిన సమయానికి దక్షిణమాడ వీధి వైపునకు చేరుకోవాల్సి ఉంటుంది. నిత్యం 1,500 మందికి ఉదయం 10, మధ్యాహ్నం 3 గంటలకు అవకాశం కల్పిస్తోంది. భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు 4 వేల మందికి నెలలో రెండు రోజులు అవకాశం కల్పిస్తూ చర్యలు తీసుకుంది. వయస్సును ధ్రువీకరించే ఆధార్‌కార్డును భక్తులు వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

**23, 30 తేదీల్లో ఐదేళ్లలోపు పిల్లలు..:** ఐదేళ్లలోపు పిల్లలతో పాటు తల్లిదండ్రులను సుపథం నుంచి ఆలయానికి ఈనెల 23, 30న ప్రత్యేకంగా అనుమతిస్తుంది. ప్రస్తుత ఏడాది వయసున్న పిల్లలకు మాత్రమే అవకాశం ఇస్తుండగా ఐదేళ్ల వయసు వరకు నెలలో రెండు రోజులు అవకాశం కల్పిస్తుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య వచ్చేవారికి ఈ ప్రత్యేక అవకాశం ఉంటుంది.

# మృత్తిక.. ప్రకృతి రక్షక

- పర్యావరణ పరిరక్షణ సాకారం
- శ్రద్ధ చూపకుంటే.. భవిత ప్రమాదకరం

నిరాకారుడైన వినాయకుని.. ఏ రూపానైనా పూజించవచ్చు. అన్నింటిలోనూ.. మట్టితో చేసిన గణపతిని పూజించడం సర్వత్రా శ్రేష్ఠమని శాస్త్రాలు చెప్తున్నా.. ఆధునికత.. ఆకర్షణీయత కోసం ప్రమాదమని తెలిసినా.. పర్యావరణానికి విఘాతమని నిపుణులు హెచ్చరిస్తున్నా.. పలు చోట్ల ఇప్పటికీ రసాయనాల సమ్మేళనంతో వినాయక విగ్రహాల వాడకం నానాటికీ పెరుగుతోంది. క్యాన్సర్‌ను వృద్ధి పరిచే కారకాలతో పాటు ప్రమాదకరమైన రంగులతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వినాయక విగ్రహాలతో పర్యావరణం దుర్గతి పాలవుతోంది. ఈ నేపథ్యంలో.. మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణానికి విఘాతం కల్గించే విగ్రహాలు వద్దంటూ.. కొన్ని సంస్థలు ఏళ్ల తరబడి చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడిప్పుడు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రజా చైతన్యంతో.. ప్రస్తుతం మట్టి విగ్రహాల తయారీకి ప్రాధాన్యం పెరుగుతూ రావడం విశేషం.

**- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**



పౌరసంక్షేమ సంస్థ తరఫున ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు (దాచిన చిత్రం)


దేవతార్చన చేయడంలో తన శక్తికి తగ్గట్టుగా చేయాలని, అందులోనూ స్వర్ణం, రజతం, పంచలోహం వాడుతుంటారని, ఇవేవీ అందుబాటులో లేకుంటే.. మట్టితో చేసే ప్రతిమలు ఎంతో పవిత్రమని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో దేవతార్చనకు మట్టితో చేసిన వినాయకులనే వాడేవారు. పర్యావరణ ప్రగతికి.. మట్టివినాయకులే ఎంతో శ్రేష్ఠమంటూ.. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యువతరం సేవా సమితి, పౌరసంక్షేమ సంస్థలు తమవంతుగా కృషి చేస్తూ వస్తున్నాయి. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎంతో శ్రమిస్తున్నారు. అంతేకాదు.. వినాయక చవితి రోజున.. వీలైనన్ని మట్టి వినాయకులను తయారుచేసి ఉచితంగా అందజేస్తూ తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.



సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు

## 'పౌర సంక్షేమం'.. లక్ష్యంగా..

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఏర్పాటైన పౌర సంక్షేమ సంస్థ మట్టి వినాయక విగ్రహాల వాడకం ఎంతో శ్రేష్ఠమంటూ గడిచిన ఐదేళ్లుగా ఉద్యమాలు చేస్తూ వస్తోంది. చవితి సంబరాలకు ముందుగా పురవీధుల ప్రదర్శనలు చేపట్టడం, మట్టి విగ్రహాలే ముద్దంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వస్తోంది. వినాయకచవితి ముందుగా మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేయడం ఆనవాయితీగా చేసుకుంది. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ విగ్రహాల పంపిణీ క్రమం తప్పకుండా జరుగుతోంది. ఈ ఏడాది వినాయకచవితిని పురస్కరించుకుని గురువారంనాడు ఒకటిన్నర అడుగు కల్గిన విగ్రహాలు 500, చిన్న విగ్రహాలు వెయ్యి ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు వెంకటేశ్వరరావు 'న్యూస్‌టుడే'కి తెలిపారు. విగ్రహాలు కావాల్సిన వారు.. గురువారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పౌరసంక్షేమ కార్యక్రమం వద్దకు వచ్చి తీసుకోవచ్చన్నారు.




## యువతరం.. ఉద్యమ పథం..

పర్యావరణ పరిరక్షణకు విఘాతం కల్గిస్తున్న రసాయన సమ్మేళనాలతో తయారు చేసే విగ్రహాలు వద్దంటూ.. పట్టణానికి చెందిన యువతరం సంస్థ కూడా తమదైన రీతిలో ప్రచారాన్ని కల్పిస్తోంది. ఐదేళ్ల నుంచి మట్టి వినాయకుల విగ్రహాల తయారీ గురించి ఉద్యమ పథంలో సంస్థ ముందుకెళ్తోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలను ఇక్కడి సభ్యులు ఎంపిక చేసుకుంటారు. ఒక్కో గ్రామంలో సదస్సులు, అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి మట్టి వినాయకుల ప్రాభావాన్ని తెలియజేస్తూ వస్తున్నారు. మూడేళ్లుగా పట్టణంలోని రామసేతు వంతెన సమీపంలో ప్రత్యేకంగా మట్టితో వినాయకుని తయారు చేయడం, వినాయక చవితి అయ్యాక.. తక్కువ నీటితో ఆ వినాయకుని నిమజ్జనం చేయడం కూడా ప్రదర్శనగా చేసి.. ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. క్యాన్సర్ కారకాలైన రంగుల వాడకంతో పాటు రసాయనాలతో నీటిలో ఉన్న జీవజాలం అంతరించి పోయే అవకాశముందని కరపత్రాలు, గోడపత్రికల ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు. ప్రధానంగా వినాయక చవితి రోజున వీళ్లు 1,116 విగ్రహాలను రామసేతు వంతెన సమీపంలో ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సంస్థ ప్రతినిధి యువకిషోర్ 'న్యూస్‌టుడే'కి తెలిపారు. ప్రతి వినాయకుని విగ్రహంతో పాటు తులసి మొక్కను ఇస్తున్నట్లు వివరించారు. మట్టి వినాయకులతో పాటు, పచ్చదనం పెంపు దృష్ట్యా.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



పెళ్లిమండపం వద్ద సిద్ధం చేస్తున్న 11 అడుగుల వినాయకుని మట్టి విగ్రహం

**పౌరసంక్షేమ సంస్థ చరవాణి సంఖ్య: 98484 20201**

**యువతరం సేవా సంస్థ చరవాణి సంఖ్య: 88853 95305**

## 'మార్పు' దిశగా.. అడుగులు

వినాయక చవితి అంటే.. శ్రీకాళహస్తి పట్టణంలో పోటీతత్వం ఎక్కువ. మా వినాయకుడు ఎత్తు ఎక్కువంటే.. మా వినాయకుడు ఎక్కువంటూ పోటీలకు వెళ్లి భారీ విగ్రహాలు తీసుకువచ్చే సంప్రదాయం మారుతోంది. ఈ దఫా వినాయక చవితికి ఆయా వీధుల్లోని వినాయక చవితి నిర్వాహక కమిటీలు మార్పు దిశగా అడుగులు వేస్తూ ఓ మంచి సంప్రదాయం వైపుగా అడుగులు వేశారు. ప్రధానంగా పట్టణంలోని పెళ్లిమండపం, బేరివారి మండపం వద్ద వినాయక చవితి నిర్వాహక కమిటీలు మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేయించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం 11 అడుగుల ఎత్తుతో బంకమన్ను, జనపనార, ఎండుగడ్డి మిశ్రమంతో వినాయక విగ్రహాలను ఎంచక్కా చేసేస్తున్నారు. ఇందు కోసం బేరివారి మండపం వారు చెన్నై నుంచి నిపుణులను పిలిపిస్తే.. పెళ్లిమండపం కమిటీ మాత్రం.. హైదరాబాదు నుంచి జేఎన్‌టీయూ పరిశోధన విద్యార్థులను పిలిపించారు. ఏది ఏమైనా.. ఈ మార్పు.. రానున్న రోజుల్లో.. పర్యావరణ పరిరక్షణకు స్ఫూర్తిగా నిలిచే అవకాశముంది.


# యాక్షన్.. వన్.. టూ.. త్రీ..

- స'చిత్ర' శేషాచలం
- అన్నీతానైన కార్యదళ చీఫ్
- ఎర్రచందనంపై చైతన్యం
- దక్షిణాది రాష్ట్రాల్లో ప్రచారం

'అడుగడుగునా పచ్చటి దట్టమైన చెట్లు.. విస్తారంగా వ్యాపించిన భారీ వృక్షాలు.. అప్పుడు అకస్మాత్తుగా గొడ్డళ్లు.. కొడవళ్లు.. కత్తులు.. భారీ రంపాలతో కొందరు అక్కడకు బారులు తీరారు.. మరోవైపున నీటిక్యాన్లు.. ఆహారపదార్థాలు.. రాత్రిబసకు అవసరమైన టెంట్లు.. తదితరాలతో మరికొందరు దారికట్టారు.. ఆపై నిరాటంకంగా పచ్చటి ఎర్ర చందనం వృక్షాలను ఇట్టే నరికేస్తున్నారు.. వనమాత వేడుకుంటున్నా కనికరించనేలేదు.. ఇంతలో ప్రత్యేక కార్యదళం వచ్చి వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకుంది.. ఆపై శరవేగంగా చట్టం తనపనితాను చేసుకుపోయింది.. అక్కడ సీన్ కట్ చేస్తే.. ఎర్రచందనం అక్రమరవాణా వ్యవహారంలో పట్టుబడిన దొంగలను చట్టప్రకారం అరెస్టులు చేయడం.. కఠినశిక్షలు అమలు చేయడం.. ఆపై ఆయా కుటుంబాల్లో నెలకొన్న తీరని విషాదం..' - ఇది తాజాగా ఎర్రచందనం అక్రమ రవాణా వ్యవహారంపై ప్రత్యేక కార్యదళం రూపొందిస్తోన్న షార్ట్‌ఫిల్మ్‌లో అటవీపరిసర ప్రాంత ప్రజలను చైతన్యవంతులను చేసే సన్నివేశాలు.

**- న్యూస్‌టుడే జీవకోన(తిరుపతి)**






## చట్టంపై అవగాహన కోసమే



ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పెట్టే కేసులు.. అనుభవించాల్సిన శిక్షలు.. స్మగ్లర్ల జీవనం.. కుటుంబ పరిస్థితులను 'శేషాచలం' షార్ట్‌ఫిల్మ్ ద్వారా చూపనున్నాం. సామాజిక మాధ్యమాల ద్వారానే కాకుండా దక్షిణాది రాష్ట్రాల్లోనూ నేరుగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అటవీ చట్టాలపై ప్రధానంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎర్రచందనం సంరక్షణలో కార్యదళం పాత్రను ప్రజలకు అర్థమయ్యేలా చిత్రీకరించాం. కార్యదళ ఐజీ డాక్టర్ కాంతారావు స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించారు. దీన్ని త్వరలోనే విడుదల చేయనున్నాం.

**- అశోక్‌కుమార్, దర్శకుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై**

శేషాచలం విశేషాలకు నిలయం. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి, అరుదైన జీవజాలానికి, వృక్షరాసికి, ప్రకృతి సౌందర్యానికి నిలయం. ఎర్రచందనం అందులో ఓ అరుదైన వృక్షరాజం. కేవలం విలువైన వృక్షంగానే కాకుండా శేషాచలం అడవులకు పచ్చదనాన్ని ఇస్తూ.. ప్రకృతి పరంగా జీవరాశికి చేయాల్సిన మేలు చేకూరుస్తోంది. ఆయా చెట్లను నరికేసి ప్రకృతికి విఘాతం కలిగిస్తే మనిషి మనుగడకే ముప్పు వాటిల్లుతుంది.. ఇది తెలుసుకుని అడవుల రక్షణకు కృషిచేస్తే సరే.. అలాకాదని అడవుల్లోకి అడుగుపెడితే.. ఈ అడవులను, వృక్షాలను కాపుకాసేందుకు రక్షక దళాలు ఉన్నాయి.. బలమైన చట్టాలు ఉన్నాయి.. కఠినమైన కేసులు ఉన్నాయి.. ఇవేవీ మిమ్మల్ని వదలిపెట్టవు.. జీవితాంతం చీకటి రోజులను అనుభవించడంతో బాటు, మీ కుటుంబాలకు సుదీర్ఘ కాలం దూరం కావలసి వస్తుంది.. జైలు గోడల మధ్య జీవితాన్ని గడపవలసి వస్తుంది.. మీ శక్తికి మించిన అపరాధ రుసుముతో బాటు.. భారీ మూల్యం చెల్లించక తప్పదు.. ఈ శేషాచలం మనది.. మనందరిది అంటూ ఏపీ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం(టాస్క్‌ఫోర్స్)రూపొందిస్తున్న షార్ట్‌ఫిల్మ్ 'శేషాచలం'. కేవలం ఎర్రచందనాన్ని ఇతివృత్తంగా తీసుకున్నా యావత్ శేషాచలంపై దృష్టిసారించిన కార్యదళం తదనుగుణంగా ప్రణాళికను రూపొందించుకుని ముందుకు అడుగేసింది. ప్రజాచైతన్య కార్యక్రమాలకు తెరతీసింది.

## దక్షిణాదిపై ప్రత్యేక దృష్టి..

ఎర్రచందన అక్రమ రవాణాకు తమిళనాడు నుంచి వస్తున్న స్మగ్లర్లకు, స్థానికంగా ఉన్న స్మగ్లర్లకు మేలుకొలుపుగా ఈ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా శేషాచలం నుంచి దక్షిణాది రాష్ట్రాల మీదుగా తరలిపోతున్న ఎర్రదుంగల అక్రమరవాణాను అడుగడు గునా కట్టడి చేసేందుకు కార్యదళం విభిన్న కార్యక్రమాలకు తెరతీసింది. పటిష్ఠ వ్యూహ రచనతోబాటు.. ప్రజాచైతన్య కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించి ఎర్రదొంగలను నమ్ముకుని తమ జీవితాలను పణంగా పెడుతోన్న కూలీలకు కనువిప్పు కలిగించేందుకు తాజాగా కార్యదళం సరికొత్త కార్యక్రమాలను రూపొందించింది. ఎర్రచందనాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తే ఎదురయ్యే పరిస్థితులు, పట్టుబడిన తరువాత ఎదుర్కోవలసిన కేసులు, ఆపై విధించే శిక్షలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నం ఈ షార్ట్ ఫిల్మ్‌ద్వారా చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది స్మగ్లర్లను అడ్డుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాలకు, ఎదుర్కొంటున్న సవాళ్లకు వాస్తవిక దృశ్యరూపం ఇస్తున్నారు. ఎర్రచందనం ప్రాధాన్యత, సంరక్షణపై ఇప్పటికే 'ఎర్రచందనం నీకు వందనం' పేరుతో షార్ట్‌ఫిలిమ్ రూపొందించి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారంలో భాగంగా ప్రదర్శిస్తున్నారు. తాజాగా నిర్మిస్తోన్న ఈ షార్ట్‌ఫిల్మ్ ఉమ్మడి రాష్ట్రాలతో బాటు సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ప్రదర్శించనున్నారు. మరీ ముఖ్యంగా తమిళనాడులో స్మగ్లర్ల ప్రాబల్యం ఉన్న జవ్వాదిమలై, తిరువళ్లూరు, సేలం, వెల్లూరు, చెన్నైల్లోని ఇతర ప్రాంతాల్లోనూ వీటిని ప్రదర్శించనున్నారు.



సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

## కథ, స్క్రీన్‌ప్లే.. డా॥ కాంతారావు



ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడం.. స్మగ్లర్లను అడ్డుకోవడం కేవలం తుపాకులతో, లాఠీలతో సాధ్యమయ్యే పనికాదు. అటవీ పరిసర ప్రాంతాల్లో అవగాహన కల్పించి, వారి సహకారంతోనూ అడ్డుకోవచ్చనే ఉద్దేశంతో 'ఎర్రచందనం..నీకు వందనం' అనే షార్ట్‌ఫిలిమ్‌ను ఇప్పటికే రూపొందించారు. దీన్ని యూట్యూబ్, అందుబాటులో ఉన్న అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రదర్శించారు. తాజాగా అక్రమరవాణాకు వస్తే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి.. తాజాగా మార్పుచేసిన అటవీ చట్టాలు.. ఒకసారి పట్టుబడితే కనీసం పదేళ్ల జైలుశిక్ష.. అవసరమైతే ఆస్తుల జప్తు.. ఆపై భవిత ఏమవుతుంది.. ఎలాంటి శిక్షలు విధించనున్నారు.. ఆపై కుటుంబాలకు ఎదురయ్యే కష్టనష్టాలు.. ఇలా అన్ని అంశాలను తాజాగా నిర్మిస్తోన్న చిత్రంలో పొందుపరిచారు. అంతేకాకుండా.. ఉదయం లేచింది మొదలు.. అర్ధరాత్రి వరకు కంటిమీద కునుకు లేకుండా.. ఎండనక.. వాననక.. చలికి వెరవక.. నిరంతరం.. నిరాటంకంగా.. ఏమాత్రం అలుపెరగక.. అడవిబాట పట్టి వనమాత సంరక్షణలో మమేకమవుతున్న కార్యదళ బృందాల వాస్తవిక జీవన విధానాన్నీ ఇందులో కూలంకషంగా నిక్షిప్తం చేశారు. ఈ రెండు షార్ట్ ఫిల్మ్‌ల రూపకల్పనలో ప్రధాన భూమిక ప్రస్తుత కార్యదళ చీఫ్.. ఒకనాటి సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు, ప్రముఖ కళాకారులు అయిన డాక్టర్ మాగంటి కాంతారావుదే. ఆయనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించారు. దగ్గరుండి అన్ని సన్నివేశాలను పర్యవేక్షించారు. కళారంగంతో ఆయనకు ఉన్న అపార అనుభవంతో ఎంతో శ్రమించి కసరత్తు చేసి స్వయంగా లఘుచిత్రానికి రూపకల్పన చేశారు. ఈ 'శేషాచలం'లో సూత్రధారులు.. పాత్రధారులు అందరూ కార్యదళ సిబ్బందే. ఎవరికివారు తమ దైన్యశైలిలో పోషించి రాణించారు. కేవలం అడవుల్లో తుపాకీ చేతబట్టి జల్లెడ పట్టడమే కాదు.. శేషాచలాన్ని కాపాడుకునేందుకు ముఖానికి రంగుపూసుకుని వేషం వేయడంలోనూ సిద్ధహస్తులమని నిరూపించారు. తొలి చిత్రానికి సినీరంగ ప్రముఖులు దర్శకత్వం వహించి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రూపొందిస్తున్న 'శేషాచలం' షార్ట్‌ఫిల్మ్‌కు టాస్క్‌ఫోర్స్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎస్సై అశోక్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో నటించిన నటీనటులు, సాంకేతిక బృందం అందరూ కార్యదళ సిబ్బందే. కొద్ది నెలల బాటు శ్రమించి అడవిలో.. అటవీ పరిసర గ్రామాల్లో కలియతిరిగి దీన్ని రూపొందించారు. దీన్ని త్వరలోనే యూట్యూబ్, ఏపీ గవర్నమెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పలు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.



# మన్ను కాచినవాడు.. మనసు దోచిన వాడు

- ఏకతాటిపై తిరునగరి
- 15ఏళ్ల నిరీక్షణ ఫలితం
- మట్టివినాయకుల పంపిణీ
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న దాతలు

**తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే:** దశాబ్దన్నర నిరీక్షణ.. ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది.. ఇప్పుడిప్పుడే క్షేత్రస్థాయిలో అవగాహన వస్తోంది.. అందరూ ఏకతాటిపై నిలిచారు.. శివశివమూర్తివి గణనాథా.. నువ్వు మన్నుమూర్తివయ్యా గణనాథా.. అంటూ కదిలారు.. పర్యావరణ హితాన్ని కాంక్షించి తిరునగరి వాసులు అడుగిడారు.. లంబోదర.. లఘుమితరా.. అంబాసుర.. అంటూ ముందుకుసాగారు.. రంగుల బొమ్మలు వద్దు.. మట్టి ప్రతిమలే ముద్దు.. అంటూ ఏకనినాదంతో ఒకరికొకరు చేయిచేయి కలిపి ఒకేబాట పట్టారు.. ఫలితంగా అటు మట్టి వినాయక ప్రతిమలు సహా.. ఇటు నిమజ్జనాన్ని కన్నులపండువగా అందరూ ఏకమై కొనసాగిస్తున్న బృహత్కార్యమే గణేశుని చవితి.. దేశంలోని పెద్దనగరాలకు దీటుగా నగరవాసులు ఏకమై గత 15ఏళ్లుగా తిరుపతి ఖ్యాతిని ఇనుమడింపజేసింది తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ..




## అంచెలంచెలుగా..



తిరుపతి నగరంలో గత 15 సంవత్సరాల క్రితం ఎలాంటి నిబంధనలు ఉండేవి కావు. ఎవరికివారు ఇష్టానుసారం మండపాల నిర్వహణ, పోలీసుల అనుమతి లేక గొడవలు, మద్యం తాగి రికార్డింగ్ డ్యాన్సులు, పరిశుభ్రత లేని నీటిలో వినాయక నిమజ్జనం.. ఇలా ఓ పద్ధతి.. ప్రణాళిక లేకుండా కార్యక్రమాలు సాగేవి. ఈ నేపథ్యంలో ఈ నగరం మనది.. మనందరిది.. అందరం సమష్టిగా కలిసి ముందుకు సాగుదామని తలచారు నగరానికి చెందిన న్యాయవాది సామంచి శ్రీనివాస్. తన సన్నిహితులు సుందరమూర్తి, భానుప్రకాష్ రెడ్డి, వెంకన్న, సురేష్ తదితర సభ్యులతో చర్చించి లీలామహల్ కూడలి సమీపంలో నిమజ్జనానికి వెళ్ళే వినాయక విగ్రహాలకు ఎద్దులబండిపై నుంచి హారతులు అందజేయడం ప్రారంభించి తద్వారా నిమజ్జన మహోత్సవ కమిటీని ఏర్పాటుచేశారు. పట్టుమని అయిదేళ్లలో దాన్ని మరింతగా విస్తరింపజేశారు. అప్పటినుంచి నేటివరకు సల్పిన నిర్విరామ కృషి ఫలితంగా వైభవోపేతంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

## మట్టి విగ్రహాలకే ప్రాధాన్యత..

తిరుపతి నగరంలో 15 సంవత్సరాల క్రితం ఎక్కడచూసినా హానికర ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన వినాయకుని విగ్రహాలే. సదరు విగ్రహాలను వినాయక్‌సాగర్‌లో నిమజ్జనం చేసేవారు. అప్పటినుంచి వచ్చే ఏడాది వరకు అవి అలానే ఉండేవి. నీటి కాలుష్యం నానాటికీ తీవ్రమైంది. ఫలితంగా పరిసరాల ప్రజలు ఎదుర్కొన్న అవస్థలు అన్నీఇన్నీకావు. నగరంలో అప్పట్లో సుమారు 200 నుంచి 250 వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే వారు. క్రమేపీ ఆ సంఖ్య 1000కు చేరుకుంది. ఒక చిన్నపాటి చెరువులో 1000 హానికర విగ్రహాల నిమజ్జనంతో ఎదురయ్యే దుష్పరిణామాలను వివరిస్తూ వాడవాడలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, నగర ప్రముఖులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో మట్టి విగ్రహాలపై అవగాహనకు నడుంబిగించి ముందుకుసాగుతున్నారు. ఆ సహకారమే నేడు తిరుపతిలో పార్టీలు.. వర్గాలు.. కులమతాలకు అతీతంగా చక్కటి ఫలితాన్నిస్తోంది.

## స్వచ్ఛంద సహకారం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నియంత్రించడంలో నగరంలోని పలువురు ప్రముఖులు, వివిధ సంఘాలు, యువత, విద్యాసంస్థలు విశేష కృషిచేశారు. నగరంలో 100 శాతం హానికర విగ్రహాల నుంచి 99శాతం మేర మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు అందరూ సన్నద్ధమయ్యారు. గతేడాది 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి విగ్రహాల ప్రాముఖ్యం.. అవగాహన కల్పించిన నేపథ్యంలో పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మట్టి వినాయకుని ప్రతిమలను అందజేస్తామని ప్రకటించారు. ఆర్యవైశ్య సంఘం, ఫుట్‌వేర్ అసోసియేషన్, వరసిద్ధి వినాయక నిమజ్జన కమిటీ, కపిలతీర్థం వద్ద పలువురు దాతలు, సుధారాణి ఫౌండేషన్ ఇలా ఎన్నో సంస్థలు.. సంఘాలు..కమిటీలు స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. ఇక యువత మేముసైతం అంటూ మరో అడుగు ముందుకేసి ఉచితంగా కాకుండా మట్టివిగ్రహాలను రూ.5లకు విక్రయించి వచ్చిన నగదును అనారోగ్యంతో బాధపడుతున్నవారికి అందజేశారు. నగరానికి చెందిన స్వహస్త ఆర్గనైజేషన్ యువత ఈ మట్టివిగ్రహాల పంపిణీలో అందరికీ ఆదర్శంగా నిలిచారు.

## సమష్టికృషితో..: -సామంచి శ్రీనివాస్, కమిటీ కన్వీనర్



తిరుపతి ఆధ్యాత్మిక నగరాన్ని పవిత్రంగా ఉంచడానికి, నగరంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణం కాపాడటానికి యువత ముందుకు రావాలి. యువత తలుచుకుంటే సాధ్యం కానిది లేదు. అత్యధిక మండపాల నిర్వహణ యువత చేతుల్లో ఉంది. అందరి సమష్టి కృషితో మరిన్ని మట్టి విగ్రహాల ఏర్పాటుకు కృషిచేస్తాం. అధికారులు, ప్రముఖుల సహకారం మరువరానిది.






గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

# కర్రలు, రాళ్లతో ఇరువర్గాల ఘర్షణ

## 15 మందికి బలమైన గాయాలు

**దిగువసాంబయ్యపాళెం (తొట్టంబేడు), న్యూస్‌టుడే:** డీకేటీ భూముల విషయంలో ఏర్పడిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీయడంతో 16 మంది గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని దిగువసాంబయ్యపాళెంలో ఆదివారం చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్సై భాస్కర్‌నాయక్ కథనం ప్రకారం... ఈశ్వర్‌రెడ్డి, మునిరెడ్డి కుటుంబానికి, వీరారెడ్డి కుటుంబాల మధ్య పొలాల సమస్యపై గ్రామంలో రెండువర్గాలు ఆదివారం చర్చలు జరుపుతుండగా తీవ్రస్థాయిలో వాగ్వాదం ఏర్పడింది. ఇది తీవ్ర రూపం దాల్చడంతో ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడుల్లో వీరారెడ్డి వర్గానికి చెందిన వీరారెడ్డి(60), అంకమ్మ (65), వెంకటరెడ్డి (35), బాలాజీరెడ్డి (30), వెంకటలక్ష్మీ (40), కృష్ణారెడ్డి (28), రామిరెడ్డి (63), మునెమ్మ (55), చెంగారెడ్డి (49), గంగమ్మ (60), మునిరెడ్డి వర్గానికి చెందిన మునిరెడ్డి (55), ప్రభాకర్‌రెడ్డి (23), పోలిరెడ్డి (31), సుబ్బమ్మ (45), వెంకటసుబ్బమ్మ (55), ఈశ్వరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రైవేట్ వాహనంలో పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సను అందజేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలోని డీకేటీ, గ్రామ కంఠాలను ఇరువర్గాల వారు ఆక్రమించుకుని మట్టిని అమ్ముకోవడంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు స్థానికలు తెలిపారు.

# పోలీసులు, గ్రామస్థుల మధ్య ఘర్షణ

**బుచ్చినాయుడుకండ్రిగ, న్యూస్‌టుడే:** వినాయకచవితి చందా వసూలు చేస్తున్న యువకులు, పోలీసులకు మధ్య జరిగిన వివాదం కాస్త ఘర్షణకు దారితీసిన ఘటన మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారి పద్మావతిపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... వినాయకచవితి సమీపిస్తుండటంతో పద్మావతిపురం వద్ద కొంత మంది యువకులు రహదారికి అడ్డుగా పెద్ద తాడును ఉంచి వాహనదారులు, ప్రయాణికుల వద్ద నుంచి చందాలు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఆదినారాయణరెడ్డి తన సిబ్బందితో కలసి చెన్నై నుంచి ఎర్రచందనం నిందితుడిని వ్యానులో తీసుకుని వెళుతున్నారు. పద్మావతిపురం గ్రామానికి రాగానే యువకులు వారి వ్యానుకు అడ్డుగా తాడును ఉంచి చందా అడిగారు. పోలీసులు రూ.10 ఇవ్వగా పక్కనే ఉన్న మరో యువకుడు అంతే ఇచ్చారేంటి మరి కొంచెం ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సిందిగా గట్టిగా అడిగాడు. ఆగ్రహించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది యువకుడిపై చేయిచేసుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పక్కనే గల గ్రామస్థులు కూడా జోక్యం చేసుకుని యువకులకు మద్దతుగా పోలీసులపై ఎదురుతిరిగారు. మేము పోలీసులమని వారు వారించినా స్థానికులు వినకపోవడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వేరే దారిలేక వాహనాన్ని అక్కడే వదిలి పరుగులు తీశారు. ఎస్సై రామమోహన్‌కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనపై టాస్క్‌ఫోర్స్, బీఎన్‌కండ్రిగ పోలీసులు తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై రామమోహన్ తెలిపారు.



ఘటనా స్థలంలో గుమికూడిన గ్రామస్థులు

# కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

## మృతురాలు 8 నెలల గర్భిణి

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** నగరంలో కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం వెలుగు చూసింది. ఈస్ట్ ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కొర్లగుంట, కట్టకింద పల్లెలో వాణి(28), భర్త సుబ్రమణ్యంతో కలిసి నివాసం ఉంటోంది. కడపజిల్లా, రాజంపేట మండలం, నడింపల్లెకు చెందిన హనుమంతు, రత్నమ్మల కుమార్తె వాణిని తొమ్మిది నెలల క్రితం సుబ్రమణ్యంకు ఇచ్చి వివాహం జరిపించారు. భర్త ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. గత కొంతకాలంగా కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో భార్యభర్తలు గొడవపడేవారు. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్న వాణి భర్త, కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో గదిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించారు. అప్పటికే వాణి మృతి చెందడంతో సమాచారం అందుకున్న ఈస్ట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే వివాహిత ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు అందించాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న వాణి

# నీళ్ల ట్యాంకర్ ఢీకొని బాలుడి మృతి

**పలమనేరు, న్యూస్‌టుడే:** నీళ్ల ట్యాంకరు ఢీకొని నిజామ్ (7) అనే బాలుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక అటవీశాఖ అతిథి గృహం వద్ద ఆదివారం ఉదయం రోడ్డుపక్కన ఆడుకుంటున్న బాలుడిని ట్యాంకరు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్సకు 108 సిబ్బంది చిత్తూరుకు తీసుకెళ్లగా అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. మృతదేహాన్ని పలమనేరు ఆసుపత్రికి తీసుకొచ్చి పోలీసులు శవపరీక్ష నిర్వహించారు. ఈ దుర్ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిజామ్ మృతదేహం

# వృద్ధురాలికి స్వైన్‌ఫ్లూ లక్షణాలు?

## గ్రామంలో వైద్య శిబిరం

**నూతుగుంటపల్లి(రామచంద్రాపురం), న్యూస్‌టుడే:** మండలంలోని అనుప్పల్లి పంచాయతీ నూతుగుంటపల్లెకు చెందిన ఓ మహిళకు (65) స్వైన్‌ఫ్లూ సోకినట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. గత నాలుగు రోజులుగా జ్వరం రావటంతో తిరుపతిలో ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె వైద్యం తీసుకుంటూ శనివారం స్విమ్స్ ఆసుపత్రిలో చేరారు. సదరు వృద్ధురాలికి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని కుప్పంబాదూరు పీహెచ్‌సీ వైద్యులు గౌరీశంకర్ తెలిపారు. ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ అనుమానంతోనే తిరుపతికి తరలించారని చెప్పారు. ఇక..జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయగౌరి ఆదేశాల మేరకు నూతుగుంట పల్లిలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో సుమారు 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతివారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులను దూరం చేయొచ్చని వైద్యాధికారి గౌరీశంకర్ సూచించారు.

# మహిళ ఆత్మహత్య

**గుడ్లనాయనపల్లె (కుప్పం గ్రామీణ), న్యూస్‌టుడే:** కుప్పం మండలం గుడ్లనాయనపల్లె పంచాయతీ ఊరినాయనిపల్లె గ్రామానికి చెందిన బొత్తమ్మ (35) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈనెల అయిదున పురుగులమందు తాగి ఆమె ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెను కాపాడేందుకు వారుచేసిన ప్రయత్నాలు చివరకు ఫలించలేదు. 15 రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆమె తనువు చాలించింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లోకేష్ తెలిపారు.

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

**మధ్యాహ్నం**

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

## ఈటీవీ ప్లస్

**ఉదయం** 11:00 కిక్ రిపీట్
**మధ్యాహ్నం** 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 హంగామా రిపీట్
**సాయంత్రం**
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
**రాత్రి**
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ.3:30, సా.7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా.10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా.4:00, రా.9:00)
- ★ ఆయుష్ (ఉ.9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ.1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ.2:00, రా.7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ.2:30, రా.9:30)

## ఈటీవీ సినిమా

**ఉదయం:** 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), **మధ్యాహ్నం:** 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), **సాయంత్రం:** 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), **రాత్రి:** 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

## ఈటీవీ అభిరుచి

**ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో** - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో –** స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, **ఉ.9:30: వావ్ ఏమి రుచి –** అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు –** జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, **ఉ.11.00: గోరు ముద్దలు –** ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ –** ఫ్రూటీ ఓట్స్, **ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్** - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ –** ఓట్స్ మసాల పూరీ, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - ఫీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, **మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్** - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి –** గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ **(జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ –** చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, **మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ –** బీన్స్ ఉసిలి, **మ.2.30, సా.6.00: చోటా షెఫ్ –** సాబూదాన చుడ్వా, **మ.2.45, రా.10.45: జిల్ –** నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, **మ.3.00: ఛాయ్ బిస్కెట్ –** కార్న్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మాండ్ కాఫీ, **మ.3.15: సూప్స్ & స్టార్టర్స్** - ఎగ్ డ్రాప్ సూప్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

# ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

**SVBC** — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

**భక్తి TV** — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

**Zee తెలుగు** — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్యం, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

**maa** — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

**GEMINI** — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

**HBO** — **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

# పైసల పంచాయతీ

బకాయిలు రూ.200 కోట్లు

ఒత్తిడి పెంచుతున్న ట్రాన్స్‌కో

చేతులెత్తేస్తున్న పల్లె పాలకులు

ప్రభుత్వ ప్రకటనపై అస్పష్టత

● రేణిగుంట మేజర్ గ్రామ పంచాయతీ. ప్రతి నెలా విద్యుత్ బిల్లు రూ.6 లక్షల వరకూ చెల్లిస్తోంది. పాత బకాయిలు రూ.60 లక్షలు పేరుకుపోయాయి. మొత్తం చెల్లించాలని ట్రాన్స్‌కో ఒత్తిడి చేస్తోంది. ఇటీవల విద్యుత్ సరఫరా ఆపేశారు. కొంత మొత్తం చెల్లించాక మళ్లీ పునరుద్ధరించారు.

● తిరుచానూరు మేజర్ పంచాయతీ. నెలకు రూ.4 లక్షల వరకూ విద్యుత్ బకాయిలు చెల్లిస్తోంది. పాత బకాయిలు రూ.40 లక్షలు ఉన్నాయి. ఈమొత్తాన్ని చెల్లించాలని విద్యుత్ శాఖ నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇదేకాదు.. జిల్లాలో 1363 గ్రామ పంచాయతీల పరిస్థితి ఇదే. బకాయిపడ్డ వాటిలో ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీలే అధికం. వాటికొచ్చే నిధులూ అంతంత మాత్రం. గత పదేళ్లుగా విద్యుత్ బకాయిలున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనప్పుడల్లా అందులో నుంచి 12 శాతం చెల్లిస్తున్నారు. అయినా బకాయిలపై ఒత్తిడి పెరగడంతో ఇక తమ వల్ల కాదని పల్లె పాలకులు చేతులెత్తేస్తున్నారు.



**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే**

2009 నుంచి మేజర్ పంచాయతీలు మినహా మైనర్ పంచాయతీలు విద్యుత్ బకాయిలు చెల్లించలేదు. అప్పటి నుంచీ జిల్లాలోని పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ.300 కోట్లకు చేరుకున్నాయి. గత రెండేళ్లుగా ఆశాఖ నుంచి ఒత్తిడి పెరిగింది. పలు పంచాయతీల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. అనంతరం కొంత మొత్తం చెల్లించాక తిరిగి పునరుద్ధరించారు. 14వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి బకాయిల్లోని కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం పంచాయతీలను ఆదేశించింది. ఈక్రమంలోనే మూడు విడతలుగా రూ.80 కోట్లు బకాయిలు చెల్లించారు. ఇంకా రూ.200 కోట్లు పైగా బకాయిలుండగా, ఈమొత్తాన్ని చెల్లించాల్సిందేనని ఆశాఖ అధికారులు, చెల్లించలేమని పంచాయతీ అధికారులు తేల్చి చెప్పడంతో విద్యుత్ పంచాయితీ మళ్లీ మొదటికొచ్చింది.

### 12శాతం బకాయిలకే

14వ ఆర్థికసంఘం నిధుల్లో 50 శాతం పంచాయతీల్లో సిమెంటుదారుల నిర్మాణానికి వెచ్చించాలన్నది ప్రభుత్వ నిబంధన. మిగిలిన 50 శాతం గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి సమకూరుతుంది. ఎఫ్ఎఫ్‌సీలో మిగిలిన 50 శాతంలో 12 శాతం విద్యుత్ బకాయిలు చెల్లిస్తున్నారు. 8శాతం సర్పంచులు, సిబ్బందికి వేతనాలు అందిస్తున్నారు. ఇక మిగిలిన 30 శాతం నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేయాల్సి వస్తోంది. ఈపరిస్థితుల్లో గత పదేళ్లుగా పేరుకున్న విద్యుత్ బకాయిలు చెల్లించమంటే అందుకు సరిపడా నిధులు తమ వద్ద లేవని సర్పంచులంటున్నారు. ఇది వరకు గ్రామాల్లో తాగు నీరు, వీధి దీపాల కోసం వినియోగిస్తున్న విద్యుత్‌కు సంబంధించి మీటర్లు లేవు. సగటు వాడకాన్ని అంచనా వేసి ఆయా పంచాయతీ ఖాతాలో లెక్కించేవారు. దీంతో పంచాయతీల్లో అనధికార విద్యుత్ వినియోగం కూడా పంచాయతీకే వర్తించేది. ఈలెక్కన బిల్లు తడిసి మోపెడైంది. ఇటీవల మీటర్లు అమర్చారు. అయినా నెలనెలా అన్ని పంచాయతీలకు సక్రమంగా బిల్లులివ్వడం లేదని సర్పంచులంటున్నారు. ఇచ్చినా నామమాత్రపు ఆదాయ వనరులున్న చిన్న పంచాయతీలు బిల్లులు చెల్లించే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు.

### ఉచితంగా ఇవ్వండి

పంచాయతీల్లో స్తంభాలు నాటి, వాటి ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. తద్వారా విద్యుత్తు శాఖ రూ. కోట్లు ఆదాయాన్ని గడిస్తోంది. స్తంభాలపై డిష్ వైర్లు లాగినా వారి నుంచి నిర్ణీత మొత్తంలో పన్ను వసూలు చేస్తోంది. మరి పంచాయతీలకు ట్రాన్స్‌కో ఏమీ చెల్లించడం లేదు. పైగా విద్యుత్తు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. ఇకపై పంచాయతీలకూ కొంత మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించాలని సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మరి ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించే మోటార్లకు ఉచిత విద్యుత్ ఎందుకు అందివ్వరని వారు ప్రశ్నిస్తున్నారు. తాగు నీటికి, వీధి దీపాలకు ఇకపై ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### బకాయిలపై స్పష్టత కరవు

పదేళ్లుగా ఉన్న పంచాయతీ విద్యుత్ బకాయిలపై గతంలో ప్రభుత్వం స్పందించింది. 2015 డిసెంబరు 31 వరకు ఉన్న బిల్లులను రద్దు చేసి, అందుకు సంబంధించిన మొత్తాన్ని ఒకే సారి ట్రాన్స్‌కోకు చెల్లించనున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి వచ్చే నెలవారీ బిల్లులను మాత్రం పంచాయతీలే చెల్లించాలంది. అంతటితో సరి. ఆప్రకటనపై స్పష్టత లేదు. పంచాయతీ అధికారుల్లోనూ దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రద్దు చేసినా 2015 సంవత్సరానికి ముందు ఉన్న బకాయిలపై ఇప్పటికీ సర్‌ఛార్జీ పేరుతో అదనపు మొత్తాన్ని బిల్లుల్లో చేర్చి లెక్క చూపుతున్నారని కొందరు, అసలు పాత బకాయిలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మరికొందరు అధికారులు భిన్న వాదనలు వినిపిస్తున్నారు.

### పొదుపు చర్యలపై దృష్టి

పంచాయతీల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 65 మండలాల్లో ఒక్కో పంచాయతీలో మొదటి విడతగా ఎల్ఈడీలను ఏర్పాటు చేసి, రెండవ విడతలో మిగిలిన అన్ని పంచాయతీల్లో అమర్చనున్నారు. ఎల్ఈడీలతో కొంత విద్యుత్ భారం తగ్గినా, నీటి అవసరాలకు వినియోగించే విద్యుత్ కూడా భారం కానుంది. దీంతో పాటు గత పదేళ్లుగా ఉన్న బకాయిలపై ప్రభుత్వం ఏదో ఒకటి తేల్చుకుంటే గ్రామ పాలనకు అవరోధం కానుంది.

### నాలుగు నెలలే సమయం

పంచాయతీ పాలక వర్గాలకు 2018 జూలై 31వ తేదీతో గడువు ముగియనుంది. అందుకు సరిగ్గా 10 నెలలు మాత్రమే సమయం ఉంది. ఎన్నికలకు 6 నెలల ముందు నుంచే పంచాయతీలకు నిధులు మంజూరు ఆగిపోతాయి. అంటే ప్రస్తుత సర్పంచులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా మరో 4 నెలల లోపే చేయాలి. బకాయిలు చెల్లించకపోతే విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తామంటూ విద్యుత్తు అధికారులు హెచ్చరిస్తుండటంతో సమస్యను ఎలా పరిష్కరించాలో పల్లె పాలకులకు అర్థం కావడం లేదు.

### పంచాయతీలకు భారం..

పంచాయతీల విద్యుత్తు బకాయిలుగా చూపుతున్న లెక్కల్లో స్పష్టత లేదు. గత ప్రభుత్వం 2015 డిసెంబరు 31 వరకూ ఉన్న బకాయిలను మాఫీ చేస్తున్నట్లు అప్పట్లో ప్రకటించింది. అయినా పాత బకాయిలకు సంబంధించిన సర్‌చార్జ్ ఇప్పటికీ విధిస్తున్నారు. నెల నెలా బిల్లులు ఇవ్వడం లేదు. ప్రస్తుతం వాడుతున్న విద్యుత్ బిల్లులు చెల్లించడమే సర్పంచులకు సాధ్యం కావడం లేదు. ఇక రూ.లక్షల్లో బకాయిలు చెల్లించమంటే చెల్లించేందుకు సరిపడా నిధులు అందుబాటులో లేవు.

**- సురేష్‌నాయుడు, డీఎల్‌పీఓ తిరుపతి**

### ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి..

పంచాయతీల్లో విద్యుత్ బకాయిలు గత పదేళ్ల నుంచి ఉంది. ఇటీవల 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రెండు విడతలుగా రూ.80 కోట్లు చెల్లించాం. ఇంకా రూ.200 కోట్లు బకాయిలున్నట్లు విద్యుత్ శాఖ లెక్క చెబుతోంది. ఒత్తిడి చేస్తున్నా ఎక్కడా సరఫరాకు అంతరాయం కలగకుండా జిల్లా పాలనాధికారి ఆదేశాలు జారీ చేశారు. పాత బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. వాటిని చెల్లించే ఆర్థిక స్థోమత పంచాయతీలకు లేదు.

**- కేఎల్ ప్రభాకర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి**



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీవీఎస్ఓ రవికృష్ణ, వేదికపై ప్రముఖులు




హరికథాగానం చేస్తున్న ధూళిపాళ శివరామకృష్ణశర్మ

# తెలుగు పదాలకు జీవం పోసిన 'ఆదిభట్ల'

## 'గోదాదేవి కల్యాణము' గ్రంథావిష్కరణ

**తిరుపతి(సాంస్కృతికం), న్యూస్‌టుడే:** హరికథ పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస ఎన్నో తెలుగు పదాలకు జీవం పోశారని విజయవాడకు చెందిన ప్రముఖ శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పేర్కొన్నారు. ఆదిభట్ల నారాయణదాస 153వ జయంతి ఉత్సవాలు నగరంలోని మహతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సదస్సులో పత్ర సమర్పణ చేసిన శ్యామలానందప్రసాద్ 'నారాయణదాస తెలుగు అనువాద లలితాసహస్రనామం తల్లివిన్కి' అనే అంశంపై ప్రసంగించారు. లలితాసహస్రనామం విశిష్టతను తెలుగు వారందరూ అర్థం చేసుకునేలా అనువదించారని వివరించారు. తెలుగు పదాలకు జీవం పోసి 1500పదాలతో అచ్చ తెలుగు పదాలతో నిఘంటువును రూపొందించారని తెలిపారు. తితిదే సీవీఎస్వో ఆకె రవికృష్ణ మాట్లాడుతూ నారాయణదాస తెలుగు భాషకు ప్రపంచఖ్యాతి తెచ్చారని కొనియాడారు. కలియుగంలో నామ సంకీర్తన వైశిష్ట్యాన్ని తెలియజేశారని, సమాజానికి చక్కటి ధార్మిక సందేశాన్ని అందించారని వివరించారు. తితిదే ప్రాజెక్టుల ప్రత్యేకాధికారి ఎస్.ముక్తేశ్వరరావు మాట్లాడుతూ హరికథ ప్రాచుర్యానికి నారాయణదాస విశేషకృషి చేశారని తెలిపారు. సంగీతం, సాహిత్యం, నాట్యం, అభినయం కలిపి హరికథను సమాహార కళగా తీర్చిదిద్దారని వివరించారు.

### ఘనంగా గ్రంథావిష్కరణ

ఆదిభట్ల జయంతి కార్యక్రమంలో భాగంగా రాజశేఖరుని లక్ష్మీపతిరావు భాగవతులు రచించిన 'గోదాదేవి కల్యాణము(హరికథ)' గ్రంథాన్ని సీవీఎస్వో ఆకె రవికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం అతిథులను శాలువతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ధూళిపాళ శివరామకృష్ణ.. ప్రహ్లాద చరిత్ర హరికథా గానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీపీపీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, తితిదే విద్యాశాఖాధికారి రామచంద్ర, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ వైవీఎస్ పద్మావతి, హరికథా విభాగాధిపతి ఎంవీ సింహాచలశాస్త్రి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, నగరవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

**తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎంసెట్ బైపీసీ చివరి విడత కౌన్సెలింగ్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాంతీయ కో-ఆర్డినేటర్ ఆచార్య జీఎన్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 22, 23తేదీల్లో ఎస్వీయూలోని పాత ఎంబీఏ భవనం, పాలిటెక్నిక్ క్యాంపస్ ప్రాంగణాల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామన్నారు. మొదటి ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు ప్రవేశాల ప్రక్రియకు హాజరు కావచ్చన్నారు. అక్కడికక్కడే వెబ్ ఆప్షన్స్ పెట్టుకునే వెసులుబాటును కల్పిస్తున్నామని చెప్పారు.

## ద్రవిడ విశ్వవిద్యాలయానికి ఉప సభాపతి బుద్ధప్రసాద్

**కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆదివారం రాత్రి కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. విశ్వవిద్యాలయంలోని అతిథిగృహం వద్ద ఆయనకు ఉపకులపతి ఆచార్య సత్యనారాయణ, రెక్టారు బాలసుబ్రహ్మణ్యం, రిజిస్ట్రార్ తిరుపతిరావులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలో సోమవారం ఉదయం పది గంటలకు జరిగే 'శంకరంబాడి సుందరాచారి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.



బుద్ధప్రసాద్‌కు స్వాగతం పలికిన ఉపకులపతి సత్యనారాయణ, రెక్టారు బాలసుబ్రహ్మణ్యం తదితరులు



# TENTH English

*It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.*

ప్రతిభ

# Nithin is fond *of* eating..

## PREPOSITIONS

*A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.*

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

### Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

**Examples:** 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

**A. Simple Prepositions:** in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

**B. Compound Prepositions**

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

**Examples:** 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

### Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond ............ eating sweets.
2. English is quite different ............ Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .......... the side gate.
5. I'll return your book ............. a week.

### Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are ....... the most popular fruits.
2. Moiz usually sits ......... Saikumar in the class.
3. There is something special ............ our Headmaster.
4. A new bridge is being built ........... the river.
5. She looks nice ................ make-up.

**C. Compound Prepositional Phrases**

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

**Examples:**

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

| Comp.Prep.Phrases | Meanings |
|---|---|
| along with | together with |
| on account of | because of |
| by means of | through the agency of |
| apart from | separate from |
| ahead of | earlier than something/ somebody |
| in front of | located before |
| in place of | as a substitute for |
| inspite of | disregarding the difficulty |
| in case of | in the event of |
| by way of | via |
| due to | on account of |
| for the sake of | for the good of |
| in addition to | added to |
| in accordance with | in agreement with |

**Examples:** The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

### Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .............. his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers ......... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space ................. the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .......... firewood.
a) for the sake of b) in addition to c) in search of

### Answers

**Ex-1:** 1) of 2) from 3) off 4) through 5) in
**Ex-2:** 1) among 2) beside 3) about 4) across 5) without
**Ex-3:** 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

---

# జనరల్ స్టడీస్
## ఫిజిక్స్

# గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

**1.** ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

**2.** ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

**3.** ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

**4.** భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

**5.** రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

**6.** టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

**7.** గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

**8.** ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
**కారణం (R):** పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

**9.** శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

**10.** శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

**11.** కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

**12.** రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

**13.** ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

**14.** స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

**15.** ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

**16.** 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

**17.** ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

**18.** కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం ($\lambda$), పౌనఃపున్యం ($\upsilon$) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) $\lambda$, $\upsilon$ రెండూ పెరుగుతాయి
2) $\lambda$ పెరుగుతుంది, $\upsilon$ స్థిరం
3) $\lambda$ తగ్గుతుంది, $\upsilon$ స్థిరం
4) $\lambda$, $\upsilon$ రెండూ తగ్గుతాయి

**19.** వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

**20.** సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

**21.** మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

**22.** R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) $n^2$ R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

**23.** వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

**24.** పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

**25.** నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

### జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1-3 | 5-2 | 9-4 | 13-1 | 17-3 | 21-1 | 25-3 |
| 2-1 | 6-1 | 10-4 | 14-4 | 18-3 | 22-4 | |
| 3-3 | 7-1 | 11-4 | 15-2 | 19-4 | 23-2 | |
| 4-4 | 8-1 | 12-3 | 16-2 | 20-4 | 24-1 | |

# కరెంట్ అఫైర్స్

# ప్రతిభ



**క్రీడలు** **టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్** **ఆగస్టు 14**

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లి సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

# జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

## జాతీయం

### ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

- ★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

### ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

- ★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

### ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

- ★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.
- ★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.
- ★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

### ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

- ★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.
- ★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.
- ★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



### ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

## అంతర్జాతీయం

### ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

- ★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

### ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

## వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

### హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

### ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

## రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

### స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు




తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

- ★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.
- ★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

## రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

### ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

### పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

- ✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

### ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

## రాష్ట్రీయం - తెలంగాణ

### ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

- ★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.
- ★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

### సిద్ధిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

- ✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్ధిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

### ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

### 'ఓడీఎఫ్'గా హైదరాబాద్

- ✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

## వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

### సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

- ✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

## అవార్డులు

ఆగస్టు 14:

### శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

# హాయ్! ఓ బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

## పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద

## సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

| | | |
|---|---|---|
| 1. Summer | వే | ☐ ☐ |
| 2. Flute | వే | ☐ ☐ |
| 3. Speed | వే | ☐ ☐ |
| 4. Heat | వే | ☐ ☐ |
| 5. Pay | వే | ☐ ☐ |
| 6. God | వే | ☐ ☐ |
| 7. Function | వే | ☐ ☐ |
| 8. Dawn | వే | ☐ ☐ |

- డీ దయామతి, హన్మకొండ

## దారేది?



# చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.




చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

## నవ్వుల జల్లులు!

**టీచర్:** రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

**రాము:** మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

**టీచర్:** 30 + 30 ఎంత అవుతుంది?

**రఘు:** ఆరు టీచర్...

**టీచర్:** కాస్త బుర్ర పెట్టి చెప్పు!

**రఘు:** నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

## చిలిపి ప్రశ్న

**నీళ్లు ఎందుకు తాగుతాం?**


- జీ రమేష్, పెనుబర్తి

## ఏది భిన్నం?










# పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇది గోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతకకూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1. వేసవి 2. వేణువు 3. వేగము 4. వేడిమి 5. వేతనం 6. వేలుపు 7. వేడుక 8. వేకువ

# పేదలకు పన్ను ఊరట

☛ ఇంటిపన్ను మినహాయింపు ☛ పంచాయతీలకు ప్రత్యామ్నాయ నిధులు

☛ జిల్లాలో 5 లక్షల కుటుంబాలకు ఊరట

**గ్రామ పంచాయతీలకు పన్నులే కీలక ఆదాయ వనరు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, మౌలిక వసతులు మెరుగుపరచాలన్నా, సిబ్బందికి జీతభత్యాలు అందించాలన్నా పన్నులు వసూలు కావాల్సిందే. గ్రామాభివృద్ధితో ముడిపడి ఉండటంతో వందశాతం వసూళ్లు చేయాల్సిందేనంటూ ఇంతవరకు ఒత్తిడి పెంచిన ప్రభుత్వం.. ఇంటిపన్ను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఇంటి పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల ప్రకటించడంతో జిల్లాలో లక్షలాది పేద కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.**

**- చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే**

గత కొంతకాలంగా గ్రామాల్లో ఇంటి పన్ను అందరూ చెల్లించకున్నా, ఇకపై కచ్చితంగా నిర్ణీత మొత్తంలో పన్నుల వసూలుకు చర్యలు చేపట్టారు. స్థానికంగా వసూలయ్యే పన్నులకు, ప్రభుత్వం విడుదల చేసే నిధులకు ముడిపెట్టడంతో సామాన్యులు కూడా పన్ను చెల్లించక తప్పని పరిస్థితి. పన్నులు పూర్తిగా వసూలు చేసి, పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంటి కొలతల ఆధారంగా పన్నులు వసూలు చేయాలని కొత్త నిబంధన విధించడంతో పన్ను భారం మరింత పెరిగింది. ఈనేపథ్యంలో మంత్రి ప్రకటన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కలిగించనుంది.

### పేదలపై మోయలేని భారం

జిల్లాలో 1363 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో సుమారు 8 లక్షల గృహాలున్నాయి. వీటిలో 5 లక్షలకు పైగా ఇళ్లు పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవే. ప్రతి ఏటా ఇంటి పన్ను రూపంలో రూ.80 కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.43 కోట్లు పన్నులు వసూలు చేయగలిగారు. అయితే నిత్యావసరాలతో పాటు, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరగడం సామాన్యులకు కుటుంబ పోషణ కష్టమైంది. దీనికి తోడు ఇంటి పన్ను పేదలకు మరింత భారంగా మారింది. ఇది చాలదన్నట్లు ఏటా 5 శాతం ఇంటి పన్ను పెంచేస్తున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు పన్ను చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. పన్ను వసూళ్లకు ప్రభుత్వం విడుదల చేసే నిధులకు ముడి పెట్టడంతో పన్ను వసూలు చేయక తప్పని పరిస్థితి. సంబంధిత అధికారులు, సిబ్బంది ఒత్తిళ్లతో పేద, మధ్య తరగత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందుకే పేదలకు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఏటా 5 శాతం పెంపు

2002లో గ్రామ పంచాయతీల వ్యవస్థలో అనేక మార్పులు చేశారు. అప్పట్లో కొత్తగా గ్రామ కార్యదర్శి వ్యవస్థను తీసుకొచ్చారు. అనంతరం 2003 నుంచి జీఓ నెంబరు 85 ప్రకారం ప్రతి ఏటా పన్నులు పెంచే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇంటి పన్నుపై 5శాతం ఏటా పెంచుతున్నారు. ఇది పేదలకు తలకు మించిన భారంగా మారింది. అంతకుముందు 5 ఏళ్లకోసారి పన్ను పెంపు విధానం ఉండేది. ప్రత్యేకాధికారి ప్రతి పంచాయతీకి వెళ్లి అక్కడి పరిస్థితులు బట్టి పన్ను నిర్ణయించేవారు. కొత్త విధానం ద్వారా ఏటా పన్ను పెంచుతుండడంతో గ్రామీణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఇది గమనించిన ప్రభుత్వం తాజాగా పేదలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది. ఇది అమల్లోకొస్తే పేదలకు పన్ను భారం తప్పినట్లే.

## ముగిసిన ఎన్ఐవోఎస్ పరీక్ష

**చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే :** జిల్లా లోక్‌శిక్షా సమితి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో వయోజనులకు నిర్వహించిన ఎన్ఐవోఎస్ పరీక్ష ఆదివారం ముగిసింది. గత మార్చిలో గైర్హాజరైన 30,542 మంది వయోజనులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా లోక్‌శిక్షా సమితి డీడీ తెలిపారు. జిల్లావ్యాప్త హాజరు శాతం సోమవారం వెల్లడిస్తామన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీ

**చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం జరగనుంది. ప్రజలు తమ సమస్యలను ఫోన్ నెంబరు: 08572-234000కు విన్నవించి న్యాయం పొందొచ్చు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జరిగే కార్యక్రమంలో చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక ఫోన్ ద్వారా వచ్చే సమస్యలను స్వీకరించనున్నారు. వాటన్నింటిని వారం రోజుల్లోనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.

☛ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండింటి వరకు గ్రీవెన్స్‌సెల్ జరగనుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు పోలీసు అధికారులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు అందించే ఫిర్యాదులను చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక స్వీకరించి పరిష్కరించనున్నారు.

## ప్రజల పక్షాన భాజపా..

☛ 4న చక్కెర కర్మాగారం ఎదుట నిరసన

☛ భాజపా కిసాన్ మోర్చా నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

**తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే:** భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల పక్షాన, ప్రజా సమస్యల కోసం పనిచేస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బైరాగిపట్టెడలోని భాజపా కార్యాలయంలో ఆదివారం జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన రైతుల సమస్యలపై సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన మూడో విడత రుణమాఫీ నగదు ఇప్పటి వరకు జమకాలేదని తెలిపారు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి ఏమాత్రం తగదన్నారు. గాజులమండ్యంలోని శ్రీ వేంకటేశ్వర చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులు తోలిన చెరకుకు చెల్లించాల్సిన బకాయిలను నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఫలితంగా రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావన్నారు. ఈ నేపథ్యంలో.. వచ్చే నెల నాలుగో తేదీన సదరు చక్కెర కర్మాగారం వద్ద భాజపా కిసాన్ మోర్చా కార్యవర్గం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టాలని సమావేశంలో తీర్మానించామని చెప్పారు. సమావేశంలో భాజపా జిల్లా ప్రచార కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శులు మనోహర్, హరిబాబు రెడ్డి, కమిటీ సభ్యులు, మండల అధ్యక్షుడు, జెడ్.ఆర్.యూ.సీ సభ్యులు కృష్ణమనాయుడు, జిల్లా సంస్థాగత ప్రధాన కార్యదర్శి వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాల్ యువర్ కలెక్టరు

**చిత్తూరు(జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే :** జిల్లా సచివాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే కాల్‌యువర్ కలెక్టరు కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు జరుగుతుందని జిల్లా పాలనాధికారి పి.ఎస్.ప్రద్యుమ్న తెలిపారు. జిల్లా సచివాలయానికి రాలేని వారు 08572-240333కి ఫోన్ చేసి సమస్యలను తెలుపవచ్చన్నారు. కాల్ యువర్ కలెక్టరు ఫోన్‌ఇన్ కార్యక్రమం అనంతరం జిల్లా సచివాలయంలో 'మీ కోసం' ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు తమ అర్జీతో పాటు ఆధార్ కార్డు విధిగా జత చేయాలన్నారు. ఆధార్ జతచేసిన వినతులను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీకోసం కార్యక్రమానికి ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరుకావాలన్నారు.

## స్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి హుండీ ఆదాయం ఆదివారం అధిక మొత్తంలో వచ్చింది. స్వామివారికి భక్తులు శనివారం సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3.74 కోట్లు మేర ఆదాయం నమోదైంది. యాత్రికుల రద్దీ అధికంగా ఉండడంతో స్వామి వారి హుండీ ఆదాయం మొత్తం ఎక్కువగా వచ్చింది. ఇటీవల కాలంలో అత్యధిక మొత్తంగా రికార్డయింది.



## యాంత్రీకరణ తోనే గిట్టుబాటు సాగు



యంత్రంతో వరి నాటుతున్న రైతు

పనులకు వినియోగించే పశుసంపద తరిగిపోవడం, కూలీల కొరత ఏర్పడటంతో వ్యవసాయం పెనుభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని యంత్రాలతో చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలు రైతుల శ్రమను, సాగు ఖర్చును 30 నుంచి 60 శాతం వరకు తగ్గించే అవకాశాలున్నాయి. కనుక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే యాంత్రీకరణ అవసరమని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య అన్నారు.

**యంత్ర పరికరాలు:** నేల దున్నటానికి కల్టివేటరు, రోటోవేటరు, విత్తనం వేయడానికి సీడ్‌డ్రిల్లర్, ప్లాంటర్, అంతరకృషి కోసం పవర్‌వీడర్, సస్యరక్షణ కోసం చిన్న స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్, పంట కోత యంత్రాలు, మల్టీ క్రాప్ క్రషర్, వరికోత యంత్రం తదితర అధునాతన యంత్రాలతో పాటు నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, జల ఫిరంగులు, బిందుసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలన్నింటిని ట్రాక్టర్లకు అనుసంధానం చేసుకుని ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ పథకం కింద పెద్ద ఎత్తున రాయితీపై యాంత్రీకరణ ఉపకరణాలను అందచేస్తున్నది. వ్యవసాయాధికారులను సంప్రదించి రాయితీ ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. రాయితీపై జల ఫిరంగులు, స్ప్రింక్లర్లు, బిందుసేద్యం పరికరాలను ఆయా మండలాల్లోని సూక్ష్మ నీటిపారుదల పథకం ఏరియా అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తారు. సాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంభిస్తే వ్యవసాయ రంగం లాభాల బాట పట్టే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరం.

**–న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)**

## సజ్జ పంటలో సస్యరక్షణ



వెర్రికంకి తెగులు సోకిన మొక్క

జొన్న తర్వాత రైతులు అధికంగా పండించే పంట సజ్జ. ఇందులో మంచి పోషకాలు ఉంటాయి. ప్రస్తుతం పంటల సాగు మొదలై నెలన్నరకు పైగా అవుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు.

**పచ్చకంకి లేదా వెర్రికంకి తెగులు:** తెగులు సోకిన మొక్క కాండంపై పూర్తిగా లేదా అసంపూర్తిగా ఆకులుగా మారిన పుష్పగుచ్ఛం ఏర్పడుతుంది. తెగులు లక్షణాలు మొదట లేత మొక్కలపై, 3-4 ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కలు పసుపురంగు లోకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటే ఆకుల అడుగుభాగంలో తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తెగులు తీవ్రదశలో మొక్కలు గిడసబారి 30 రోజులు లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులుగా మారిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. ఆప్రాన్ ఎస్.డి 35 మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను ఏరి కాల్చివేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు 5 శాతం మించి ఉంటే రిడోమిల్ (25డబ్ల్యూపీ) లీటరు నీటికి 1 గ్రా. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**తేనెబంక తెగులు:** తెగులు సోకిన కంకి నుంచి గులాబి లేదా ఎర్రరంగుగా ఉన్న తేనె వంటి చిక్కటి ద్రవం బొట్లు బొట్లుగా కారుతుంది. ఈ ద్రవంతో శిలీంధ్ర బీజాలు ఏర్పడతాయి. మొక్కలు పుష్పించే దశలో మబ్బుతో కూడిన ఆకాశం, వర్షపు తుంపరలు, వాతావరణం చల్లగా ఉండటంతో ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేస్తుంది. దీని నివారణకు విత్తనాలను లీటరు నీటికి 20 గ్రా. ఉప్పు కలిపిన నీటి ద్రావణంలో శుద్ధి చేసి, ఆరనిచ్చి కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. పైరు పూతదశలో మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి.

✦ తేలిక నేలల్లో చెదల నివారణకు ఎకరాకు 8 కిలోల 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. లేత మొక్క దశలో మిడతల నుంచి పంటను కాపాడటానికి 5 శాతం కార్బరిల్ పొడి లేదా 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని ఎకరాకు 8-10 కిలోలు చొప్పున చల్లాలి.

**–న్యూస్‌టుడే, హాలహర్వి.**

# కళాంజలిలో వానాకాలం డిజైనర్ కలెక్షన్స్



పాస్టల్ పింక్ షర్ట్, బూటీ ఎంబ్రాయిడరీతో ఎంతో స్టైల్‌గా ఉంది.

లెనిన్ షర్ట్ బీడ్ వర్క్, ఫ్లోరల్ ఎంబ్రాయిడరీతో ట్రెండీగా ఉంది. డెనిమ్స్ మీద ధరించేందుకు అనువుగా ఉంటుంది. లేత ఆకుపచ్చ, గులాబీ రంగుల్లో అందుబాటులో ఉన్నాయి.
వివరాలకు www.kalanjali.com,
www.facebook.com/kalanjaliworld




అందుబాటు ధరల్లో మహిళలు, చిన్నారుల కోసం డిజైనర్ వస్త్రశ్రేణిని తీసుకొచ్చింది కళాంజలి. వానాకాలంలో ధరించేందుకు అనువైన నూతన వస్త్రాలను పరిచయం చేసింది. ప్రకృతి స్ఫూర్తితో పక్షులు, పువ్వుల ఎంబ్రాయిడరీ, ప్రింట్స్‌తో పెటిట్ బ్లాసమ్ కలెక్షన్స్ సరికొత్తగా ఉన్నాయి. – ఈనాడు, హైదరాబాద్

# చొరబడుతున్నాయి..

❖ అడుగడుగునా అక్రమాలే ❖ అంతర్‌రాష్ట్ర స్లీపర్ల హవా ❖ చర్యలకు ఉపక్రమిస్తున్న ఆర్టీఏ

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే

రహదారులపై ఏదేని వాహనం ప్రయాణించాలంటే రవాణాశాఖ అనుమతులు తప్పనిసరి. ఏ అనుమతులు లేకుండానే ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేటు స్లీపర్ బస్సులు యదేచ్ఛగా తిరిగేస్తున్నాయి. వీటికి కళ్లెం వేసేందుకు రవాణాశాఖ దృషి సారించింది. జిల్లా మీదుగా బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు, విజయవాడకు వెళ్లే స్లీపర్ అనుమతులను ఎంవీఐ అధికారులు పరిశీలిస్తున్నారు. ఎక్కువ వాహనాలు అర్ధరాత్రి సమయంలో అధికారుల కళ్లుగప్పి అడ్డదారుల్లో ప్రయాణిస్తున్నాయి. రవాణాశాఖ అధికారులు సైతం రాత్రి సమయాల్లో ప్రధాన కూడళ్లలో కాపుకాస్తున్నారు. గత రెండురోజుల క్రితం తిరుపతి పరిధిలో ఎంవీఐ అధికారులు సురేష్‌నాయుడు, శివారెడ్డి, నాగరాజునాయక్, దినేష్‌చంద్ర తనిఖీల్లో మార్నింగ్ స్టార్, ఆరంజ్ స్లీపర్ బస్సులు నాలుగింటిని తాజాగా సీజ్ చేశారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. ఈ తరహా వాహనాలు పెదఎత్తున వచ్చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## ఇదీ విషయం..

రాత్రి సమయాల్లో పడుకుని ఒక ప్రాంతం నుంచి సుదూర ప్రాంతానికి ప్రయాణించేందుకు అనుకూలంగా స్లీపర్ బస్సులు ఏర్పాటయ్యాయి. అయితే రాష్ట్రంలో ఈ తరహా వాహనాల రిజిస్ట్రేషన్ లేదు. ఈ బస్సులో ఇరుకు బెర్తులు, భద్రత లేమి కారణంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఏపీ రవాణాశాఖ నిరాకరించింది. దీంతో ట్రావెల్ వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఏపీ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులకు అనుమతులు ఇస్తున్నారు. ఈ క్రమంలో కొందరు ట్రావెల్ వ్యాపారులు ఇతర రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులను రిజిస్ట్రేషన్ చేయించి ఏపీలో తిప్పడం ప్రారంభించారు. ఇలా దాదాపు చాలాకాలం నుంచి వ్యాపారం కొనసాగుతోంది. నిబంధనల మేరకు ఏ రాష్ట్రంలో స్లీపర్ బస్సు రిజిస్ట్రేషన్ అయితే ఆ రాష్ట్రంలో(హోంస్టేట్) తప్పనిసరిగా తిరగాలి. వ్యాపారం మెరుగ్గా ఉండటంతో స్లీపర్ బస్సులు ఏపీకి పరిమితమయ్యాయి. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కొరడా ఝుళిపించాయి. దీంతో ఈ వాహనాలు ఎక్కడా తిరగకూడని పరిస్థితి నెలకొంది. ఒకవేళ నిబంధనలు అతిక్రమించి తిరుగుతూ పట్టుబడితే రవాణాశాఖ అధికారులు సీజ్ చేస్తారు.




తిరుపతి ఆర్టీఏ కార్యాలయంలో సీజ్ చేసిన ప్రైవేటు బస్సులు

## పక్క రాష్ట్రాల్లో..

ఏపీకి సమీపంలో ఉన్న పుదుచ్చేరి, ఒరిస్సా, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన స్లీపర్ బస్సులు మార్నింగ్‌స్టార్, ఆరంజ్ తదితర పేర్లతో ఏపీలో తిరుగుతున్నాయి. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు ఆయా రాష్ట్రాల రవాణాశాఖ ఏపీ అధికారులకు సమాచారం ఇచ్చారు. రిజిస్ట్రేషన్ రద్దయిన వాహనాలు తిరగకుండా ఎక్కడికక్కడ ఆర్టీఏ అధికారులు దాడులు చేసి సీజ్ చేస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. స్లీపర్ బస్సులో సీటుకు రూ. 3,750 చొప్పున ప్రతి మూడునెలలకు 36సీట్లకు పన్ను చెల్లిస్తున్నారు. మార్నింగ్ స్టార్, ఆరంజ్ పేరుతో 150కి పైగా స్లీపర్ బస్సులు ఏపీలో తిరుగుతున్నాయని ఆర్టీఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

## చర్యలు తప్పవు..

రహదారులపై వెళ్లే ప్రతి వాహనానికి ఏదేని రిజిస్ట్రేషన్ సంఖ్య తప్పనిసరిగా ఉండాలి. రిజిస్ట్రేషన్ లేని వాహనాలు రహదారులపై ప్రయాణించరాదు. రిజిస్ట్రేషన్ రద్దయిన స్లీపర్ బస్సులను సీజ్ చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాయి. ఆ మేరకు చర్యలు చేపడుతున్నాం.

**-వివేకానందరెడ్డి, తిరుపతి ప్రాంతీయ రవాణాశాఖాధికారి**

# శ్రీవారి సేవలో జస్టిస్ నవీన్‌రావు

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు.



సప్తగిరీశుని సేవలో పాల్గొని వస్తు న్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు తదితరులు




కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్

# నిధులతోనే గ్రామీణ భారతం అభివృద్ధి

❖ ముగిసిన అగ్రశ్రీ జాతీయ సదస్సు
❖ పలువురికి రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాలు ప్రదానం

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** పంచాయతీరాజ్ నిధులతోనే గ్రామీణ భారతం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో '25 సంవత్సరాల అనంతరం పంచాయతీరాజ్ సంస్థల సంస్కరణలు' అనే అంశంపై స్థానిక హోటల్ బ్లిస్‌లో నిర్వహించిన జాతీయ సదస్సు రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమంతో ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో నిధులు, విధులు, అధికారులను ప్రభుత్వాలు సమక్రమంగా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఐటీఐ రంగంలో పునాదులు వేసింది రాజీవ్‌గాంధీ అని, దేశాభివృద్ధికి ఆయన హయాంలో అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్ణయాలే నేడు అమలవుతున్నాయని గుర్తుచేశారు. మరో అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశం పురోగతి సాధించాలంటే పంచాయతీరాజ్ ప్రతినిధులకు సమగ్ర నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహించాలన్నారు. అప్పుడే ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాజీవ్‌గాంధీ అత్యుత్తమ నాయకత్వ పురస్కారాన్ని ఐపీఎస్ఎస్ఆర్ మాజీ అధ్యక్షుడు ఆచార్య వి.ఆర్.పంచముఖి, రాజీవ్‌గాంధీ మహిళాశక్తి జాతీయ పురస్కారాన్ని ప్రముఖ మిసైల్ శాస్త్ర వేత్త డాక్టర్ టెస్సీథామస్‌కు మాజీ స్పీకర్ చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మాజీ రామచంద్రారెడ్డి, సెస్ ఆచార్యులు డాక్టర్ ఎం.గోపినాథ్‌రెడ్డి, అగ్రశ్రీ వ్యవస్థాపకుడు డాక్టర్ సుందరరామ్, భారతీ సుందరరామ్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పతకం.. దేశానికే గర్వకారణం

## డీఎస్పీ రామ్‌కుమార్‌కు పోలీసుల ఘనసన్మానం

**చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే :** పోలీసు శాఖ తరపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించిన ప్రత్యేక బ్రాంచి డీఎస్పీ రామ్‌కుమార్ దేశానికే గర్వకారణమని. . ఇలాంటి మరెన్నో పతకాలను సొంతం చేసుకోవాలని చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ పోలీసు, ఫైర్ అధికారుల టెన్నిస్ టోర్నీలో బంగారుపతకం సాధించిన డీఎస్పీ రామ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖలో నిత్యం ఒత్తిడిలో ఉంటూ.. క్రీడలపై కూడా దృష్టి పెట్టడం అసాధ్యం. అయినా ఎంతగానో శ్రమించి ప్రపంచ పోలీసు టెన్నిస్ టోర్నీలో అసాధారణ విజయం సాధించారన్నారు. దేశం తరపున విదేశాల్లో మరిన్ని క్రీడల్లో పాల్గొని.. మరెన్నో పతకాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## పోలీసుశాఖ రుణం తీర్చుకోవాలనే..

బంగారుపతక విజేత, చిత్తూరు ప్రత్యేక బ్రాంచి డీఎస్పీ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పోలీసు టెన్నిస్ టోర్నీ ఫైనల్స్‌లో చండీగఢ్ ఎస్పీ ఆశిష్‌కుమార్‌తో కలిసి ఫైనల్‌లో హాంకాంగ్ పోలీసు జట్టుపై విజయం సాధించానన్నారు. 1991లో స్పోర్ట్స్ కోటాలో ఎస్సైగా ఉద్యోగం సాధించానని, పోలీసుశాఖ రుణం ఎలాగైనా తీర్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకుని కష్టపడ్డానని తెలిపారు. విధులను నిర్వర్తిస్తూనే క్రీడల్లోనూ ముందున్నానని చెప్పారు. అలా గత ఏడాది జరిగిన ఆల్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి బంగారు పతకం సాధించానన్నారు. అమెరికాలో జరిగిన పోటీలో 12 వేల మంది పాల్గొనగా, మన దేశం నుంచి 116 మంది పాల్గొన్నారని అందులో రాష్ట్రం నుంచి తాను ఒక్కడే ఎంపికై పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. డీజీపీ, ఐజీ, గత ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్, ప్రస్తుత ఎస్పీ రాజశేఖర్‌బాబులు సహకారం ఎంతగానో ప్రోత్సహించారన్నారు. డీఎస్పీ రామ్‌కుమార్ తండ్రి శ్రీరాములునాయుడు మాట్లాడుతూ కుమారుడి విజయంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక, డీఎస్పీలు, సీఐలు ఘనంగా సన్మానించారు. ఎస్సైలు, కానిస్టేబుళ్లు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అంతకముందు పోలీసు అధికారులు, సిబ్బంది కలసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



నగరంలో ర్యాలీ



డీఎస్పీ రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అదనపు ఎస్పీ రాధిక, పోలీసు అధికారులు